# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 40 సంచిక 3

పేజీలు 44

నవంబర్ 2020

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** .............................. ....... **పేజీ**


దాశరథీ శతకము .......................................4

శ్రీబాబూజీ ఉవాచ.......................................5

అమ్మమాట.......................................8

హైదరాబాద్ శాఖలో కార్యక్రమాలు..........10

అదృష్టం - ఆశయం ఏది గొప్ప? .............11

జనకుడు జ్ఞాని ఎలా అయ్యాడు?..........13

మా ఆశ్రమం - శ్రీకాళీవనాశ్రమం.........15

రామాయణంలో స్త్రీ పాత్రలు......................17

భక్తుడు గురుదేవుని పొందేమార్గం.....18

బాబూజీతో అనుభవాలు .............................19

సర్వవ్యాపి ......... ........... ............. ...........21

బ్రాహ్మణుడు ................. ................. ..................25

ఎవరు అమరుడు? .... ........ ...... ................28

శ్రీబాబు దివ్యవాణి ............... ..........................31

కైవల్యోపనిషత్ ... ...........................................32

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.............................34

గౌతమ మహర్షి ...... ........................ ......................35

నేడే ఈ నాడే .................. ...................................36

సోదరి నివేదిత ...... ....... ..................................37

సమర్థ సద్గురునాథుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు ...... ......................... ...................41

## **దాశరథీ శతకము** - భద్రాచల రామదాసు

**రంగదరాతిభంగ, ఖగ రాజతురంగ, విపత్పరంపరో**
**త్తుంగ తమఃపతంగ, పరి తోషితరంగ, దయాంతరంగ స**
**త్సంగ ధరాత్మజా హృదయ సారసభృంగ నిశాచరాబ్ద మా**
**తంగ, శుభాంగ, భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ!**

తాత్పర్యం -
శత్రువులను సంహరించినవాడవు, గరుత్మంతుడు వాహనముగా కలవాడవు, ఆపదలను పోగొట్టువాడవు, రంగనాధునిచే సేవించబడినవాడవు, దయతోనొప్ప మనస్సు గలవాడవు, సత్సంగుడవు, సీతా హృదయమను పద్మమునకు తుమ్మెదవంటి వాడవు, రాక్షసులకు భీభత్సకరుడవు, శుభాంగుడవగు ఓ భద్రాచల రామా!




*శ్రీ బాబూజీ గాజు ఎందుకు వేసుకున్నారు?
*భగవంతునికి చేసే నిజమైన సేవ ఏది?
*జీవులలో మూడు రకాలు ఏవి?
*ప్రసాదం కడుపు నిండా తినకుండా కొంచెమే ఎందుకు తినాలి?
*మనస్సు ఎప్పుడు తన రూపాన్ని కోల్పోతుంది?
*ఎటువంటి హృదయంలో భగవంతుడు ప్రతిఫలిస్తాడు?
*సాధువు తినే పదార్థాల రుచిని ఎందుకు పట్టించుకోలేదు?
*కృష్ణుడు రథం దిగి ఎందుకు నిల్చున్నాడు?
*గురువు నేర్పిన పదాలు వచ్చాయని ధర్మరాజు ఎందుకు చెప్పలేదు?

*సమాధానాలు లోపలి పేజీలలో..........................*

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

11-9-1980

ఈరోజు ఉదయం శ్రీ బాబూజీ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ "గురుదేవుల బోధలను ఎవరు సరిగా అర్థం చేసుకుంటారో వారే ధన్యులు. వారికే ముక్తి లభిస్తుంది. వారికే జ్ఞానం ప్రాప్తిస్తుంది. జ్ఞానేన లభతే ముముక్షత్వం. గురుఆజ్ఞాపాలన, గురుబోధా శ్రవణము మననము చేసినవారే గురుకృపకు పాత్రులౌతారు. గురుబోధని అందరూ వినవచ్చుకాని అది విన్న వారిలో ఎంతమంది దానిని సరిగా అర్థం చేసుకుంటారు? అర్థం చేసుకున్నా దానిని ఆచరించాలికదా!



భగవానుడు సర్వవ్యాపకుడు, సమస్త జీవరాశులను ప్రకాశింపజేస్తూ తాను స్వయంగా ప్రకాశిస్తాడు అని గురుదేవుడు ప్రబోధించాడనుకోండి. ఈ ప్రబోధాన్ని విన్న శిష్యుడు ఒకనాడు కార్యార్థమై వెళుతుండగా ఎదురుగా మదించిన ఏనుగు ఒకటి వస్తోంది. ఆ దారి వెంబడి వెళ్ళేవారంతా ఎక్కడివారు అక్కడ ప్రక్కకి తప్పుకున్నారు. ఏనుగును తోలే మావటివాడు హెచ్చరిక చేస్తూనే ఉన్నాడు. తప్పుకోండి తప్పుకోండి అని.

కాని మూర్ఖుడైన శిష్యుడు గురుదేవుడు చెప్పిన బోధని ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. భగవానుడు సర్వవ్యాపకుడు కదా! కాబట్టి నాలోనూ, ఏనుగులోనూ ఉన్నది పరమాత్మ వస్తువే కదా! అని ఆ ఏనుగుకి ఎదురుగా నిలుచున్నాడు. ఏమవుతుంది? జరగవలసిందే జరిగింది. గురుదేవుడు చేసిన బోధ ఏమిటి! దానిని అర్థం చేసుకున్నదేమిటి?

విషయం తెలిసిన గురుదేవుడు బాధపడి 'శిష్యా! నీ ఎదురుగా ఏనుగు వస్తోంది. అది మదించినది. ఆ సంగతి నీకు తెలుసుకదా!

ఆ దారినపోయే జనం అంతా ఎక్కడివారు అక్కడ జాగ్రత్తపడ్డారుకదా! ఏనుగు భగవంతుడైతే, మావటివాడు మాత్రం భగవానుడు కాదా! హెచ్చరిక చేస్తూనే ఉన్నాడు కదా! మరి ఆ హెచ్చరికను ఎందుకు పాటించలేదు?' అన్నారు. ఇలాగే ఉంటుంది. గురుబోధని సరిగా అర్థం చేసుకోవాలి" అన్నారు శ్రీ బాబు.

శ్రీబాబుజీ గురుదేవుని బోధని సరిగా అర్థం చేసుకున్న శిష్యుని కథకూడ ఒకటి చెప్పారు. ఒక గురుదేవుడు తన శిష్యులను పిలిచి అందరికీ పండ్లను ఇచ్చి ఈ పండ్లని మీరు ఎవ్వరు చూడకుండా భుజించాలి. అలా ఎవరు భుజిస్తారో వారు ధన్యులు అని చెప్తారు.

ఒక శిష్యుడు పండు తీసుకొని కాకులు దూరని కారడవి, చీమలు దూరని చిట్టడవి, చేరి ఎవరు చూడటంలేదని భావించి పండును భుజిస్తాడు.

ఇంకొక శిష్యుడు ఒక చెట్టుపైకి ఎగబ్రాకి ఆచెట్టు చివరన కూర్చుండి ఎవరూ తనను చూడటం లేదని నిర్ధారణ చేసుకొని తన గురుదేవుడు ఇచ్చిన పండును భక్తి శ్రద్ధలతో భుజించి తానుకదా గురువాజ్ఞాపాలన చేశానని తృప్తి చెందుతాడు.

ఇంకొక శిష్యుడు మాత్రం తనకిచ్చిన పండును భుజించకుండా తిరిగి తీసుకువచ్చి గురువుగారికి ఇచ్చివేస్తాడు. స్వామీ! మీరు నన్ను ఈ ఫలాన్ని ఎవరూ చూడకుండా భుజించమన్నారు. ఈ ఫలం భుజించటానికి ఎక్కడా అటువంటి ప్రదేశం లభ్యం కాలేదు. అందుచేత భుజించలేకపోతున్నాను. పరమాత్మ సర్వవ్యాపకుడు కదా ఆయనకి భిన్నంగా ఏదీలేదుకదా! అంటాడు.

మిగిలిన శిష్యులు మాత్రం స్వామీ! మీరిచ్చిన ఫలము ఎవరు చూడకుండా భుజించాము అని చెప్పారు.

ఆహా ఏమి అదృష్టము. నేను చేసిన బోధని సరిగా అర్థం చేసుకున్న శిష్యుడు ఒక్కడైనా ఉన్నాడు చాలు అని సంతోషిస్తాడు ఆ గురుదేవుడు. మిగిలిన శిష్యులతో, శిష్యులారా! నేను చేసిన బోధని ఇంతవరకే అర్థం చేసుకున్నారా? నేను పరమాత్ముడు, సర్వవ్యాపకుడు అని చెప్పాను. ఈ చరాచర జగత్తులో ఎవరూ చూడని ప్రదేశం ఎక్కడ ఉంది? పిపీలికాది బ్రహ్మ పర్యంతమును ప్రకాశింపచేసేది ఆత్మవస్తువేకదా! అదిలేని ప్రదేశము ఏది? అలా ఉందని ఎలా అనుకున్నారు. అది

అజ్ఞానమేకదా! చూశారా అటువంటి జ్ఞాన హీనులైన శిష్యులు ఎంతమంది ఉండి ఏం లాభం? జ్ఞానవంతుడైనవాడు ఒక శిష్యుడు చాలడా? అన్నారు శ్రీ బాబు.

గురుబోధని వినటం, అర్థం చేసుకోవటమేకాక ఆచరించటం ముఖ్యం. ద్రోణాచార్యుడు పాండవులకు కౌరవులకు విద్యాబోధన చేస్తూ ప్రథమంగా, సత్యం, శాంతి, దయ, ప్రేమ అనే నాలుగు పదాలని నేర్చుకోమంటాడు. రెండవరోజు ద్రోణాచార్యుడు శిష్యులారా నేను నిన్న నేర్పిన పదాలు నేర్చుకున్నారా అని ప్రశ్నించేసరికి పాండవులు, కౌరవులు అంతా ముక్తకంఠంతో నేర్చుకున్నాము అని చెప్తారు. కాని ధర్మరాజు మాత్రం మౌనంగా ఉన్నాడు. ద్రోణాచార్యుడు వెంటనే 'ధర్మరాజా! నీ మౌనానికి కారణం ఏమిటి?' అని ప్రశ్నిస్తాడు.

ధర్మరాజు వెంటనే సమాధానం చెపుతూ 'గురుదేవా మీరు నేర్పిన నిన్నటి పదాలని ఇంకా నేను నేర్చుకోలేకపోయాను. వాటిని నేను ఆచరించినప్పుడు కదా నేను నేర్చుకోవటం పూర్తి అయినట్లు' అని చెప్తాడు.

"చూశారా అదీ గురువిచ్చిన లక్ష్యార్థమును అర్థం చేసుకోవటం అంటే, అందుచేతనే ధర్మరాజు అంతటి గొప్పవాడు" అన్నారు శ్రీ బాబు.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా నవంబర్, డిసెంబర్ 2020 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోనండి.

***నవంబర్ 2020:*** AS 3922, 5308, 6309, 6639, 7186, 7609, 7923, 7924, 7945, 7946, 8474, 8475, 8477, 8480, 8484, 8486, 8487, 8488

***డిసెంబర్ 2020 :*** AS 7195, 7198, 7199, 7200, 7418, 7626, 8491, 8493 - 8499

# అమ్మమాట

- రమణ ప్రసాద్

## అర్చనం

భగవన్నామం మధురమైనది, ఖర్చు లేనిది. నామం చేస్తే అది మన నిత్యకాలంలో జమ అవుతుంది. ఇప్పుడు మనం అమ్మవారికి కుంకుమ పూజలు చేసికొన్నాము. మన మనఃపటలంలో పరమేశ్వరుడు నిలిచాడా, లేదా? మనస్సు అమ్మ పాదార విందములపై నిలబడితే మన పూజ సఫలమైనట్లే. పూజ (అర్చన)ఏకాగ్రతతో చేస్తే నిజమైన తృప్తి కలుగుతుంది.



"ఓం నమః శివాయ, ఓం నమః శివాయ, ఓం నమః శివాయ" - అహో! ఎంత అందమైన నామం? భావ శుద్ధితో చేస్తే మనస్సు లక్ష్యమూర్తిపై నిలబడుతుంది. అది ఏక వస్తువు. లక్ష్యశుద్ధి అయితే భావశుద్ధి కలుగుతుంది. శివుడు ఎప్పుడూ ధ్యానంలో ఉంటాడు. శిరస్సు నుండి గంగ ప్రవహిస్తూనే ఉంటుంది. అమ్మవారు మనకు వరాలు ప్రసాదిస్తూనే ఉంటుంది. ఏ పనులూ ఆగవు. ఆ ధ్యానముద్ర మన హృదయంలో స్థిరపడాలి. ధ్యానంలో నిటారుగా కూర్చోవాలి. జపమాల చేతితో చేస్తే చెయ్యి కొలికి పూసకోసం తడుముతుంది. అందుకే జపమాలను చిత్తానికి అందించాలి. "ఓం" - ప్రణవ స్వరూపం; "శివాయ నమః" - సదా శివునికి నమస్కరిస్తున్నాను అని అర్థం. నీ ఆరాధ్య దైవానికి మనస్సులో అర్చన చేస్తున్నావు, అభిషేకం చేస్తున్నావు. నీ హృదయం శివమందిరం అయిపోతుంది. చిత్తవృత్తులు నిరోధింపబడతాయి. మనస్సు నిర్మలమవుతుంది. ఆత్మానుభవం కలుగుతుంది.

**తెలిసినందుకు గురుతు తెలివి మరువని సాక్షి,**

**నిజము అవనిజములకు హరిహరులు సాక్షి।**

ఎవరు ఆ తెలివిలిని చూస్తున్నారు? నువ్వే. నీలో ఉన్న ప్రజ్ఞయే. అది సాక్షిగా ఉంటుంది. ఏది నిజం ? అది మన నిజస్థితి. ఏది నిజంకాదు?

ఈ పరిణామ స్వరూపమైన జగత్తు. హరిహరులు సాక్షి ఎలా అంటే- మనం హరి హరుల క్షేత్రంలో ఉన్నాం. ఆయన ఎవరు? పరమాత్ముడే! ఆ భగవంతుని సన్నిధిలో ఉన్నాం. ఏ విధంగా ఆ అనుభూతిని పొందాలి?

**సారూప్యం తవ పూజనే శివమహాదేవేతి సంకీర్తనే**

**సామీప్యం శివభక్తి ధుర్యజనతా సాంగత్య సంభాషణే।**

**సాలోక్యం చ చరాచరాత్మకతనుధ్యానే భవానీపతే**

**సాయుజ్యం మమ సిద్ధమంత్ర భవతి స్వామి న్కృతార్థో స్మృహమ్ ॥**

- శ్రీ శివానంద లహరి

శ్రీ శంకరాచార్యులవారు ఈశ్వరుని ఇలా ప్రార్థిస్తున్నారు -

"సారూప్యం" - స్వామిని చూడగానే ఆ రూపం నిలుస్తోందా, లేదా?

"సామీప్యం" - సంకీర్తనలో ఆ స్వామి సామీప్యాన్ని పొందుతున్నామా, లేదా?

శివ భక్తి ధుర్య జనతా - శివ భక్తులతో కలిసి విచారణ చేయటం "సాలోక్యం";

"చరాచరాత్మక తనుధ్యానే తవ సాయుజ్యం" -భవానీపతే! లోకమందు ఉన్నా చరాచరాత్మమైన నీ మూర్తి ధ్యానమునందు "సాయుజ్యము"ను ప్రసాదించు. ఇంకా,"మమ సిద్ధమంత్ర భవతి స్వామీ కృతార్థోస్మృహమ్ " - అటువంటి సిద్ధ మంత్రాన్ని నాకొసగి నన్ను కృతార్థుడిని చెయ్యి ప్రభో !.

**మయ్యేవ సకలం జాతం, మయిసర్వం ప్రతిష్ఠితం।**

**మయి సర్వం లయం యాతి త ద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్ ॥**

'నాలోనించే సమస్తం పుడుతోంది, నాలోనే ప్రకాశిస్తోంది, నాలోనే లయం అవుతోంది. ఆ బ్రహ్మను నేనే అయి ఉన్నాను.'

మనం ఆ స్థితిలోనే ఉన్నాం, గుర్తించండి. మనం అనునిత్యం ఆ స్వామి స్మరణలో ఉన్నాం. మనం శ్రీ గురుదేవుల ఒడిలో ఉన్నాం. ఆయనే మనలను చెయ్యి పట్టుకొని నడిపిస్తున్నారు.

కాబట్టి అట్టి ధర్మమార్గంలో నడుస్తూ, సదాశివుని స్మరణలో వుంటూ, స్వామి సాయుజ్యాన్ని పొందాలని, అట్టి భక్తిని, శక్తిని సాధనా సంపత్తిని శ్రీగురుదేవులు మనందరికీ ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**నవంబర్ 2020**

10 మంగళ - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

14 శని - నరక చతుర్దశి, అమావాస్య - దీపావళి - ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

18 బుధ - నాగుల చవితి

25 బుధ - చిలుక ఏకాదశి (కార్తీక శుద్ధ ఏకాదశి)

26 గురు - క్షీరాబ్ది ద్వాదశి సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

30 సోమ - కార్తీక పౌర్ణమి - (గురుపౌర్ణమి) - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

**డిసెంబర్ 2020**

3 గురు - శ్రీబాబూజీ స్వస్వరూపలయం చెందిన రోజు. సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

9 బుధ - శ్రీ గురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

16 బుధ - శ్రీధనుర్మాస వ్రత ప్రారంభం.

20 ఆది - సుబ్రహ్మణ్య షష్ఠి .ఉ॥ 11 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

25 బుధ - క్రిస్మస్, గీతా జయంతి, ముక్కోటిఏకాదశి ఉ॥ 11గం. శ్రీ సద్గురుపాదపూజ, భక్త సమారాధన.

30 బుధ - మార్గశిర పౌర్ణమి, దత్తజయంతి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

# అదృష్టం - ఆశయం ఏది గొప్ప?

-జగన్నాధప్రసాద్

**మనసే అందాల బృందావనం**
**వేణుమాధవుని పేరే మధురామృతం**

వేరే ఎటువంటి భావనలూ చొరబడలేనంతగా మనసు ఆ వేణుమాధవుని నామంతో, ఆ పరమాత్మ చింతనతో నిండిపోతే! 'అటువంటి మనసే అందాల బృందావనం' - అటువంటి స్థితే ముక్తికి మార్గం.

మనం సాధారణంగా అనుకుంటాం, 'రాధ, రుక్మిణి, సత్యభామ ఎంత అదృష్టవంతులో కదా, వారు తమ భక్తి, ప్రేమ భావనలతో కృష్ణపరమాత్మణ్ణి తమ స్వంతం చేసుకున్నారు కదా' అని. కానీ, వారు ఏమనుకుంటున్నారో! "పరమాత్మను మనం స్వంతం చేసుకున్నామట! అవ్వ! ఎంత చోద్యం! మనకంటే ఆ గోపికల భక్తే ఎక్కువ కదా. ఎందుకంటే, గిరిధారి మనవాడే అని మనం అంటున్నా, 'మా గోపయ్య ఎప్పుడూ మా దగ్గరే వుంటున్నాడు, మమ్మల్ని ఆటపాటలతో ముంచెత్తి, ఆనందపరవశులను చేస్తున్నాడు' అని ఆ పదహారువేలమంది గోపికలూ అంటున్నారు కదా! అందుచేత వారి భక్తి, అదృష్టమే ఎక్కువ కదా!"

**నిజమే కదా. కానీ, ఆ గోపికలు ఏమంటున్నారో!**

"ఆ నల్లనయ్య ఎల్లకాలం మన దగ్గరే వున్నాకానీ, ఆ మురళికి వున్నంత అదృష్టం మనకు లేదు కదా! ఆ చిల్లుల ఖాళీ వెదురు గొట్టం ఎల్లప్పుడూ కృష్ణయ్య చేతిలో వుల్లాసంగా వూగుతూ, ఆ మధురమైన పెదవులపై నాట్యమాడుతూ, మోహన రాగాలు వినిపిస్తూ వుంటుంది కదా. ఆ మోహనాంగుడు ఎక్కడకు వెళ్ళినా, తగుదునమ్మా అంటూ ఇదీ తయారే కదా! మరి గోపయ్య దానిని విడిచి ఎందుకు వుండలేడో! అదృష్టమంటే దానిదే కదా!"

**నిజమే సుమా. మరి ఆ మోహన మురళి మనోగతం?**

"ఈ మురళీకృష్ణుడు నన్ను వదలి అస్సలు వుండలేడని అందరూ నన్ను ఆడిపోసుకుంటున్నారు. కానీ నాదీ ఒక భాగ్యమేనా? ఈ కన్నయ్య నిద్రించే సమయంలో నన్ను ప్రక్కన పెడతాడు కానీ, తన అమృత

హస్తాలలో వుంచుకోడు కదా. అది నాకు ఎడబాటు కాదా! కన్నయ్య వీపు మీద వుండే ఆ తేనె రంగు పుట్టుమచ్చను చూడండి. అది ఎప్పుడూ గోపాలుని అంటిపెట్టుకుని వెన్నంటే వుంటుంది కదా. కృష్ణయ్య ఎక్కడకు వెళ్లినాగానీ, ఏం చేస్తున్నాగానీ అది విడిచిపెట్టదు కదా. 'ఛీ పో' అన్నాగానీ అది ఎక్కడకీ పోదు, పోలేదు. దానికి మానాభిమానాలు, రాగద్వేషాలు లేవు. ఎవరేమన్నాగానీ, ఏమీ వినబడనట్లు, నిమ్మకు నీరెత్తినట్లు ఎంత చిద్విలాసంగా వుందో! ఇప్పుడు చెప్పండి గిరిధారి పలుకరిస్తే, ఏవో నాలుగు పలుకులు పలికే నాది అదృష్టమా, లేక మౌనంగా ఎల్లప్పుడూ ఆ మధుర స్వరూపాన్ని అంటిపెట్టుకుని, రాజయోగిలాగా వుంటున్న ఆ పుట్టుమచ్చదా అదృష్టం?"

**కానీ, ఆ పుట్టుమచ్చ ఏమంటుందో!**

"నాదే అదృష్టం అని అందరూ అంటున్నారు కానీ, కానేకాదు. నోరు లేనిదానను. పరంధాముడిని కీర్తించలేను. నమస్కరించలేను. కనీసం తలపలేను. పరమాత్ముడు అవతారం మారినప్పుడు నేను ఎవ్వరికీ కనిపించను. 'భగవంతుడు ఎంత భక్తసులభుడు' అని అంటారు. ఆ భక్తులు చూడండి. ఎంత తన్మయంగా పాడుకుంటున్నారో! వారు భగవంతుడిని అర్చించుకుంటున్నారు, ధ్యానిస్తున్నారు. పరమాత్ముడు ఎప్పుడూ వారి మనస్సులోనే బందీగా వుంటాడు కదా. వారిదే కదా అసలైన అదృష్టం!"

**సరే. భక్తుడు ఏమంటాడో!**

"నాదేముంది? నిమిత్తమాత్రుడిని. నేను ఏది చేసినా భగవత్సంకల్పం వల్లనే జరుగుతుంది. వారి సంకల్పం లేనిదే ఎంతటి బలవంతుడైనా గడ్డిపోచను అయినా కదపలేడు".

**అవును సుమా. మరి, చివరిగా భగవంతుడు ఏమంటాడో!**

"ఈ సకల చరాచర సృష్టికి కర్తను, భర్తను, హర్తను నేనే. మీ మనసులలో నాకు కాస్త చోటు ఇవ్వండి చాలు. అదే నాకు దేవాలయం. నాకు సమర్పించడానికి 'మీది' అనేది మీ దగ్గర ఏమున్నది కనుక? నన్ను ఎప్పుడూ మరువకండి. అందరూ నాకు సములే, సఖులే. సర్వేజనాః సుఖినో భవన్తు - అనేది నా ఆశ, ఆశయం!"

# జనకుడు జ్ఞాని ఎలా అయ్యాడు?

- బొంబాయి కృష్ణారావు

మిథిలా నగరాన్ని పరిపాలించే జనకునికి రాజర్షి అని బిరుదు. ఆయనను గొప్ప జ్ఞానిగా భావించి, అందరూ గౌరవించేవారు. జనకుని రాజర్షిగా, జ్ఞానిగా అందరూ ఎందుకనుకుంటున్నారో, అందులోని విశేషమేమిటో తేల్చుకుందాం అనుకున్నాడు ఒక సాధువు. నేరుగా జనకుని ఆస్థానానికి వెళ్ళాడు. జనకుడు అప్పుడు మంత్రులతో మంతనాలు జరుపుతున్నాడు. ప్రజల బాగోగుల గురించి అడిగి తెలుసుకుంటున్నాడు. కప్పం చెల్లించని సామంతరాజులపై కోపం ప్రకటిస్తున్నాడు.

ఎత్తైన సింహాసనం మీద కూర్చున్న జనకునికి పరిచారకులు అటూ ఇటూ నిలబడి వింజామరలు వీస్తున్నారు. ఒకరు పాదాలు ఒత్తుతున్నారు. ఆయన కిరీటంలో పొదిగిన రత్నాలు మణులు జిగేల్‌మంటున్నాయి. ఎటు చూసినా ఆడంబరమూ, అతిశయమే. సాధువు ఇదంతా గమనిస్తున్నాడు. ఆయనకిదేమీ నచ్చలేదు. 'ఇతడు అన్నీ లౌకిక విషయాలే మాట్లాడుతున్నాడు. లౌకికమైన సిరిసంపదలతో తులతూగుతున్నాడు. ఇతడు రాజర్షీ, జ్ఞానీ ఎలా అవుతాడు? ఇతనిని జ్ఞాని అన్నవాళ్ళు పరమ అజ్ఞానులు' అనుకున్నాడు.

సాధువు ఆ ఆస్థానంలో అడుగు పెడుతున్నప్పుడే అతని మీద జనకుని దృష్టి పడింది. మంత్రులతో మాట్లాడుతూనే అతనిని ఒక కంట కనిపెడుతూనే వున్నాడు. అతని మనో భావాలను అంతర్దృష్టితో గమనిస్తూనే వున్నాడు. సాధువును తన వద్దకు పిలిపించుకున్నాడు. సాధువు వేషంలో వున్నావు కానీ, నువ్వు నిజమైన సాధువు కాదు. సాధువు తెల్లబోయాడు. ఎప్పుడూ ఇతరులలో తప్పులెంచే స్వభావం నీది. దానితోనే నీ సమయమంతా ఖర్చు అయిపోతోంది. భగవంతుని ధ్యానానికి నీకు తీరుబడేది? సాధువు మరింత నివ్వెరబోయాడు. నా దృష్టిలో నువ్వు నేరస్థుడివి. ఒక రాజుగా నిన్ను శిక్షించక తప్పదు. నీకు మరణ శిక్ష విధిస్తున్నాను. వారం రోజులలో నిన్ను ఉరితీస్తారు. సాధువు గజగజ వణికిపోతూ నిల్చున్నాడు. జనకుడు అలా ప్రకటించిన వెంటనే భటులు అతనిని అదుపులోకి తీసుకుని చెరసాలకు తరలించారు.

అతనికి రోజూ ఉప్పులేని కూరలు, కారం కలిపిన తీపి పదార్థాలు ఆహారంగా పెట్టమని జనకుడు సేవకులను ఆదేశించాడు. అయితే

సాధువు వాటి రుచిని పట్టించుకునే స్థితిలో వున్నాడా? కళ్ళు మూసినా, తెరచినా అతనికి ఉరికంబమే కనిపిస్తోంది. తన మెడ చుట్టూ ఉరితాడు బిగుసుకుంటున్న దృశ్యమే కళ్ళ ముందు కదలాడుతోంది. కంటి మీద కునుకే కరువైపోయింది. ఆ వారం రోజులలోనే అతను మరణ భయంతో, మనో వ్యథతో చిక్కి శల్యమై పోయాడు. ప్రాణాలు కళ్ళలోకి వచ్చేశాయి.

ఏడవ రోజున సాధువును ఉరి తీయడానికి సన్నాహాలు చేయమని రాజు ఆదేశించాడు. అతికష్టం మీద అడుగులు వేస్తున్న సాధువును తీసుకువచ్చి జనకుని ముందు నిలబెట్టారు. మృత్యు భయంతో సాధువు స్పృహ కోల్పోయి కుప్పకూలి పోయాడు. కొద్దిసేపటి తరువాత స్పృహ వచ్చింది. అప్పుడు జనకుని ఆదేశం మేరకు సేవకులు అతనికి ఉప్పు కలిపిన పాలు ఇచ్చారు. సాధువు ఆ పాలను గడగడా తాగేశాడు. 'పాలు బాగున్నాయా? పంచదారా సరిపోయిందా?' అని ప్రశ్నించాడు జనకుడు చిరునవ్వుతో. 'ఎందుకు అలా అడుగుతావు మహారాజా! ఈ వారం రోజులుగా పదార్థాల రుచిని గమనించే స్థితిలో వున్నానా నేను? నాకు ప్రతి క్షణమూ, ప్రతి చోటా ఉరికంబమే కనిపిస్తోంది' అన్నాడు సాధువు. జ్ఞానబోధ చేయడానికి ఇదే తగిన సమయం అనుకున్నాడు జనకుడు.

'ఈ వారం రోజులూ నువ్వు ఏం చేస్తున్నా, ఏం తింటున్నా, నీ దృష్టి చేస్తున్న వాటిమీద, చూస్తున్న వాటి మీద లేదు. కేవలం ఉరికంబమే నీకు కనిపించింది. అలాగే నేను రోజూ ఉదయం నుంచి రాత్రి వరకూ అనేకమైన లౌకిక విధులు నిర్వర్తిస్తున్నా నా దృష్టి మాత్రం ఎల్లవేళలా పరబ్రహ్మ తత్వం పైనే లగ్నమై వుంటుంది. విశేష ధ్యానంతో నేనా స్థితిని సాధించాను. నేనీ ప్రపంచంలో వుంటూనే ఈ ప్రపంచానికి అతీతంగా వుండగలను. నా మనస్థితి ఎటువంటిదో ఇప్పుడైనా అర్థమైందా?

ఇకముందెన్నడూ ఇతరుల లోపాలను ఎంచే ప్రయత్నం చెయ్యకు. నీ బాగు నువ్వు చూసుకో. ఇతరులలో మంచినే చూడటం నేర్చుకో. తపస్సుతో, ధ్యానంతో పరమ సత్యాన్ని తెలుసుకో. ప్రపంచానికి అతీతంగా వుంటూ ప్రపంచ క్షేమం కోసం పనిచెయ్యి. ఇక వెళ్ళు! జనకుని ఔన్నత్యం, తన అల్పత్వం ఆ సాధువుకు బాగా అర్థమైంది. జనకునికి శిరస్సు వంచి నమస్కరించి అక్కడ నుండి ఆ సాధువు నిష్క్రమించాడు.

# మా ఆశ్రమము - శ్రీకాళీవనాశ్రమము

- గోనుగుంట్ల శైలజ

(గత సంచిక తరువాయి)

మా స్వామిని మేము 'బాబూజీ' అని పిలుస్తాము. మా స్వామి సమాధి వారి మందిరానికి ఎదురుగా వుంటుంది. దానిని వేము 'బృందావనము' అని పిలుస్తాము. మా బాబూజీని గురించి చెప్పమంటే, ఏమని చెప్పగలము? మాటలకు, భాషకు అందనిది. ఏ ఋషులు, కవులు వర్ణించలేనిది భగవంతుని రూపం, భగవంతుని తత్వం. ఇది కూడా అటువంటిదే. గురువును ఒకరితో పోల్చలేము. ఇలా అలా వుంటారని చెప్పలేము. అవ్యక్తమైనది ఆ తత్వం. అనుభవించడమే తప్ప మాటలకు అందనిది గురుప్రేమ.

మా అందరి హృదయాలను బృందావనంలాగా తీర్చిదిద్దారు. ఎన్నెన్నో నేర్పించారు. వేదాల అర్థాలను ముద్దుముద్దుగా అర్థమయ్యేటట్లు చెప్పారు. ధ్యానం చేయడంలో మెలకువలు నేర్పారు. ఎవరికీ సాటిరారు. మరచిననూ మరపురారు. బాధలతో వచ్చినవారినెందరినో తన ప్రేమపూరిత మాటలతో బుజ్జగించి, వారి మనస్సులలో ఆధ్యాత్మికచింతన ప్రేరేపించి, దైవోన్ముఖులుగా చేసి, వారికి జీవన్ముక్తి కలిగించారు. అందుకే మేము మా స్వామిని 'బాబూజీ' అని పిలుచుకుంటాము.

ఇప్పటి ప్రస్తుత ఆశ్రమాధిపతి పేరు 'యోగిని శ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీ'. వారు చిన్నచిన్న పలుకులచే చిన్నారి రాగాలుతీస్తూ, చిన్నిచిన్ని చేతులతో గురుసేవ చేస్తూ ఆనాటి బాల చంద్ర, ఈనాడు అపర సరస్వతియై, సంస్కృతాంధ్రములలో పండితురాలై, వేదవేదాంగాలను గురుముఖతః నేర్చుకుని, వయస్సులో చిన్నదై, జ్ఞాన సముపార్జనలో పెద్దదై, దేశవిదేశాలలో గురు తత్వమును గూర్చి ప్రచారం చేస్తూ, స్త్రీ రూపంలో వున్న వివేకానందయై, సంగీతంలో అపర మీరావలె అలరారుతున్నారు.

ఈనాడు గురుపీఠానికి అధిపతియై అందరి మనస్సులలో మమతానురాగాలను నింపి, వారి తనువులు గురుసేవకు అంకితమయ్యేటట్లు తీర్చిదిద్ది, వారికి జీవన్ముక్తికి మార్గమును బోధిస్తూ **మాతాజీ** అనే పేరును సార్థకం చేస్తున్నారు. ఆనాటి చంద్ర ఈనాడు

యోగినియై అందరి యోగక్షేమాలు చూస్తూ యోగిని చంద్రకాళీప్రసాద మాతాజీ అయ్యారు.

బృందావనానికి ఒక ప్రక్క గోశాల వుంది. ఆ గోవులకు దీక్షాసమయంలో కొందరు పూజలు చేస్తూ వుంటారు. దానిని గోదీక్ష అంటారు. గర్భవతులు ఎక్కువగా ఆ దీక్ష చేస్తారు. దాని వలన పుట్టబోయే సంతానానికి గోవు వలె సహనం శాంతము లక్షణాలు వస్తాయని వారి విశ్వాసము. శివాలయానికి ఎదురుగా శ్రీసుబ్రహ్మణ్యేశ్వరాలయము వున్నది. సతానంలేని వారు ఈ స్వామికి దీక్షచేస్తారు. ఈ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మా ఆశ్రమానికి క్షేత్రపాలకుడు.

సమర్థ సద్గురు మాసపత్రిక కూడా విడుదల అవుతుంది.

ప్రతిరోజూ భక్తులంతా సుప్రభాతం, నగర సంకీర్తన, ప్రార్థన అనంతరం గో ప్రదక్షిణాలు, ఆలయ దర్శనాలు, అమ్మగది దర్శనం తీర్థ ప్రసాదాలు స్వీకరించి, వారి వారి గృహ కార్యకలాపాలను చేసుకుంటారు.

ఇక్కడ పర్వదినాలలో చాలా బాగా జరుగుతాయి. ముఖ్యమైనది దసరా. పర్వదినాలలో వేలకొలది భక్తులు ఆశ్రమానికి వస్తారు. అప్పుడు ఆశ్రమంలోని వారు విసుగు విరామం లేకుండా వీరిని అతిథి మర్యాదలతో సత్కరిస్తారు. ప్రేమతో ఆదరించి భక్తిభావనతో సేవలనందిస్తారు.

ప్రపంచాకర్షణ మధ్యవుంటూ, ఆ ఆకర్షణలు అంటకుండా సంసారము చేస్తూ, వృత్తి ధర్మాలు ఆచరిస్తూ, ఆశ్రమానికి సేవచేస్తూ, అతిథి మర్యాదలు చేస్తూ, మనస్సు సన్యసించి, భక్తి అనే ఆకర్షణే తప్ప వేరేమీ తెలియని వీరు రాజర్షులు. వీరే హిమాలయాలలో వుంటే మహాత్ములు అంటారు. బ్రహ్మచారి కాని నిజమైన బ్రహ్మచారులు వీరే. అందుకే మా ఆశ్రమము అన్ని ఆశ్రమాల కంటే భిన్నమైనది, విశిష్ఠమైనది.

మాలో వున్న నానాత్వాన్ని నశింపజేసి, మా మనస్సులకు మాధవత్వంలోని మాధురాన్ని అందించిన మహా పురుషుడైన మా గురుదేవుని పాదపద్మములకు ప్రణామాలు అర్పిస్తున్నాను.

# రామాయణంలో స్త్రీ పాత్రలు

-సుషుమ్నా ప్రసాద

(గత సంచిక తరువాయి)

## త్రిజట

సీతారామ లక్ష్మణులు, విభీషణాదులు శ్వేత వస్త్రధారులై కనబడ్డారు. శ్వేతవస్త్రాలు పవిత్రతకు, స్వచ్ఛతకు, విజయానికి సంకేతం. అలాగే రావణ కుంభకర్ణ మేఘనాధులు హింసకు కక్షకు సంకేతంగా ఎర్రని వస్త్రాలను ధరించారు. రావణుని పుష్పకవిమానమును శ్రీరాముడు అధిరోహించాడు. రావణుడు గాడిదనెక్కాడు. రావణుడు నూనె త్రాగుతున్నట్లు కలకన్నది. అది మృత్యువుకు సంకేతం. గాడిద పై నుండి క్రిందపడిన రావణుని ఒక స్త్రీ దక్షిణ దిక్కుగా ఈడ్చుకుపోతున్నది. ఇవన్నీ రావణుని మరణాన్ని స్పష్టంగా సూచిస్తున్నాయి.

అలా త్రిజట స్వప్న వృత్తాంతం రావణ సంహారమును, సీతారాముల సమాగమమును చక్కగా అద్దంలో దర్శించినట్లుగా వివరించింది. రావణాసురుని గురించి కించిత్తు కూడా భీతిల్లక, తన స్వప్న వృత్తాంతమును ఒక దృశ్యకావ్యంగా చిత్రీకరించింది. ఆమె ఒక ధీర వనిత. రాక్షస వంశములో తప్పబుట్టిన రత్నం లాంటిది.

త్రిజట, జటాయువులలో సామ్యమున్నది. ఇద్దరూ పరోపకారులే. ఉడుతకు ఉడుతభక్తి అన్నట్లు ఇతోధికంగా రామకార్యానికి సేవచేశారు. జట అంటే కొమ్మ అనే అర్థం కూడా వున్నది. అంటే రామాయణ మహా వృక్షానికి వీరిద్దరూ మనోజ్ఞమైన రెండు కొమ్మలలాంటివారు. జట అంటే వేదాన్ని ముందు వెనుకలుగా వల్లించే పద్ధతి అని కూడా వుంది. పూర్వాపరాలను గమనిస్తూ, త్రిజట, జటాయువులు వేదమునకు ప్రతీక యైన రామాయణంలో ఋత్విక్కుల వలె వర్తించారు.

జట అంటే జడ అని కూడా అర్థం వున్నది. జడను చక్కగా అల్లినట్లుగా త్రిజట చక్కని సన్నివేశాల్లో ఒదిగిపోయి కథను అల్లడంలో తన పాత్రను చక్కగా పోషించింది. త్రిజట మళ్ళా యుద్ధకాండలో దర్శనమిచ్చి, సంక్లిష్ట సన్నివేశంలో సీతమ్మకు ఊరట కలిగిస్తుంది. మూడు పాయలు తీసి జడను అందంగా అల్లుతారు. మనసు, వాక్కు, కాయములను మూడుపాయల జడను ముగ్ధమనోహరంగా మలచి, సీతారాములకు ఆకర్షణీయమైన జటగా తనను తాను మలచుకొని తరించింది త్రిజట.

# భక్తుడు గురుదేవుని పొందే మార్గం

- గాలి జగదీష్

గురుదేవుడు అంటే భక్తునకు ప్రేమమూర్తి, జీవన జ్యోతి. అది అతని అనుభవం. సంసార దుఃఖాలలో పడి తనను మరచి సంచరిస్తున్న తన బిడ్డలను తిరిగి తన వద్దకు చేర్చుకోవడానికై గురువు వినియోగించే ఉపాయాలు సర్వాంతర్యామిగా వెలుగొందుతున్నా, భక్తిపూరితులయ్యే వారికి అతడు అత్యంత ఆప్తుడు. మానవుడి హృదయాంతరాళం నుండి వెలువడే ప్రార్థనలను అతడు ఆలకించి, తన కటాక్షాన్ని భక్తుడి మీద పరుపుతాడు.

జీవుల పట్ల అత్యంత కారుణ్యంతో భగవంతుడు అవతరిస్తాడు. ధర్మమార్గాన్ని, బ్రహ్మమార్గాన్ని లోకానికి తెలియజేయటానికై, ఆత్మశక్తికి, పవిత్రతకూ నిలయమైన ఒకానొక దివ్య మానవ రూపంలో అతడు ఆవిర్భవిస్తాడు. నిర్గుణ నిరాకార తత్వంలో భగవంతుని జ్ఞానమార్గం చేత పొందవచ్చు. సగుణరూపంలో అతనిని భక్తిమార్గంలో పొందవచ్చు.

భగవన్నామ స్మరణ, సంకీర్తన, ఆత్మార్పణతో కూడుకున్న భక్తిమార్గమే ఈ కాలంలో సులభమైన తరుణోపాయం. భక్తుడి మనోభావాన్ని అనుసరించి భగవంతుడు వివిధ రూపాలలో సాక్షాత్కరిస్తాడు. బాహ్యాంతర ప్రకృతులను వశం చేసుకుని, అంతర్గతంగా వున్న ఈశ్వరత్వాన్ని ప్రకాశింపజేసుకోవడమే జీవిత పరమావధి.

ప్రతి జీవిలోనూ దివ్యత్వం, ఈశ్వరత్వం గర్భితంగా వుంది. జీవుడి వ్యక్తిత్వానికి ఈశ్వర చైతన్యంతో సన్నిహిత సంబంధం వుంది. బ్రహ్మసాక్షాత్కారాన్ని పొందటానికై జ్ఞానయోగం, కర్మయోగం, భక్తియోగం, రాజయోగం అనే ముఖ్యమైన యోగాలలో దేనినైనాగానీ, కొన్నింటిని గానీ, అన్నింటినీగానీ అవలంబించవచ్చు.

సమస్త నీతి నియమాలకు మూలాధారం వైరాగ్యం. వైరాగ్యమంటే కామినీ, కాంచన త్యాగం, వినిర్మల వర్తనంలో, సర్వభూత హితాచరణలో సర్వేశ్వరుణ్ణి పొందాలనే పరితాపంతో వైరాగ్యం ప్రజ్వలిస్తుంది. ఇలాంటి వైరాగ్యం కలిగిన వినిర్మలమైన హృదయంలో భగవంతుడు ప్రతిఫలిస్తాడు.

# శ్రీశ్రీశ్రీ బాబూజీ మహరాజ్‌వారితో అనుభవాలు

(గత సంచిక తరువాయి)

-వి. లక్ష్మీ నరసమాంబ

అప్పటి నుండి హైదరాబాదు శాఖలో జరుగు కార్యక్రమాలకు హాజరవుతున్నాను. దశమి, పౌర్ణమి పూజలు, ఆదివారాలు ప్రత్యేక కార్యక్రమాలకు తప్పకుండా వెళ్ళేదాన్ని. ప్రతి కార్యక్రమాల చివరిలో, బాబూజీ బోధామృతంగల పుస్తకాలలో ఒక భాగాన్ని ఎవరో ఒకరు చదివి వినిపించేవారు. ఆ ప్రసంగాలను శ్రద్ధగా వింటూ వుండేదాన్ని. అలాంటప్పుడు ఏదైనా ప్రశ్నగాని, సందేహంగాని నా మనస్సులో వుండగా, సత్సంగంలో కూర్చోవడం జరిగితే, ఆ పుస్తక పఠనం పూర్తిఅయ్యేలోపు లేదా ఎవరైనా భక్తుల ప్రసంగం పూర్తి అయ్యేలోపుగా నా ప్రశ్నకు జవాబు దొరికేది. అలాంటి సందర్భాలు కొన్ని ఇక్కడ వ్రాస్తే - బాబూజీ ప్రసాదించిన కొన్ని అనుభూతులను నేను నెమరు వేసుకున్నట్లుగా వుంటుంది .....

మాతాజీగారు ఒకసారి సత్సంగ సమావేశాలకు హైదరాబాద్ ఆశ్రమానికి వచ్చారు. ఆ సమావేశాలకు నేను కూడా హాజరు అయ్యాను. అప్పుడు మా పిన్నిగారు మాతాజీ గారికి చీర ఇచ్చి నమస్కారం చేయడం గమనించి, నేను కూడా ఒక చీరను కొని మాతాజీగారికి ఇచ్చి నమస్కారం చేశాను. వారు దానిని అందుకుంటూ..........

"ఇవన్నీ ఎందుకమ్మా! మీ మనస్సు ఇవ్వండి చాలు!" అన్నారు.

ఆ మాట వారు యాథాలాపంగా అన్నదే! కాని నాకు ఎవ్వరో నా మానసిక స్థితిని గుర్తించి, బాబూజీ యందు నా భక్తి ప్రపత్తులు పెంచుకోమని, అన్య విషయములయందు ఆలోచనలు మానుకోమని హెచ్చరించినట్లు అయింది. నా విషయాలు ఎవ్వరితో చెప్పనవసరం లేకున్నా, వాటికి నేనే జవాబు చెప్పుకోవలసిన పరిస్థితి కలిగింది. బాబూజీయే - 'నా యందు హెచ్చు భక్తి శ్రద్ధలతో మనస్సు నాకు అర్పించు' అని హెచ్చరించినట్లు అనిపించింది.

అలా ఆశ్రమానికి వస్తూ పోతూ ఉంటే నాలో సుఖసంతోషాలు, మనశ్శాంతి కూడా పెరిగాయి. ముందే చెప్పినట్లుగా ఒంటరితనం, చేతినిండా పనిలేకపోవడం తప్ప నాకు వేరే సమస్యలు లేవు. ఈ క్రమంలో బాబూజీ నాకు సమయాన్ని సద్వినియోగం చేయగల

విధానాన్ని కూడా చూపించారు.

ఒకప్పుడు నేను కథలు వ్రాసే దానిని. కానీ అవి ఎక్కడా ప్రచురింపబడలేదు. నేను మళ్ళీ ఆ వ్యాసంగం మొదలు పెట్టి కథలు, నవలలు వ్రాయడం మొదలు పెట్టాను. అవి వ్రాయడం, టైపు చేయించడం, వివిధ పత్రికలకు పంపడం, కొన్ని ప్రచురింపబడడం, కొన్ని తిరిగి రావడం, ఆశ్రమంలో కార్యక్రమాలకు హాజరు కావడం లాంటి పనులలో తీరికలేకుండా సంతోషంగా నా సమయాన్ని గడుపుతున్నాను. ఆ దరిమిలా, నా కథలు హెచ్చు సంఖ్యలోనే రెండు మూడు నవలలతో సహా, విపుల, చతుర, ఆంధ్రభూమి, వంటి మంచి పత్రికలలో ప్రచురితమయ్యాయి. "వంకాయితో వందరకాలు" అని "అరవై రకాల పచ్చళ్ళు" అని వంటకాలమీద కాడా వ్రాశాను. "మహిళా విజయం" అనే పేరు మీద ఒక మహిళా మాసపత్రిక నడపబడుతుంటే దానికి ఉపసంపాదకురాలిగా పనిచేసి-అన్ని రకాల రచనా ప్రక్రియలలో అనుభవం గడించాను. ఇవన్నీ నాకు ఒక రచయిత్రిగా గుర్తింపు తెచ్చాయి. జీవితంలో ఏదో ఒక పని చేస్తూ ఉండడం, అందులో ఎంతో కొంత సాధించడం - గొప్ప తృప్తిని ఆనందాన్ని ఇస్తాయి. అదీ ముఖ్యంగా వృద్ధాప్యంలో ! ఆవిధంగా భగవద్గీతలో చెప్పబడిన కర్మయోగ సిద్ధాంతాన్ని అనుభవ పూర్వకంగా గ్రహించాను. క్రమంగా నా జీవితాన్ని ఎవరో చేయి పట్టుకుని నడిపస్తున్నట్టుగా అనిపించ సాగింది. తిరిగి బాబూజీ నాకిచ్చిన అనుభూతుల విషయానికి వస్తే ఎన్నో అనుభవాలలో నాకు బాగా గుర్తుండిపోయిన వాటి గురించి వ్రాస్తాను.

- సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన దేవరకొండ యల్లయ్యశాస్త్రి(తబలా చిన్నారి) గారు 11-10-2020 ఆదివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 75 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.


సర్వవ్యాపి
మధుప
భగవానుడు సర్వవ్యాపి. ఆయన లేని చోటుగాని, ఆయనకు కనపడని దృశ్యంగాని, వినపడని శబ్దంగాని లేవు.
1


కొన్ని రోజుల తరువాత...
మీరు ముగ్గురూ ఈ అరటిపళ్ళను ఎవరూ చూడకుండా తినండి.
2


అలాగే గురుదేవా!
3
అమ్మయ్య! ఇక్కడ ఎవరూ లేరు. నేను హాయిగా ఈ అరటిపండు తినేస్తాను.
4


ఈ చెట్టు తొర్రలో నన్ను ఎవరూ చూడలేరు. ఇక్కడే నేను నా పండు తింటాను.
5


ఏం నాయనా! వాళ్ళిద్దరూ తమ పండ్లు తినేశారు కదా! నువ్వెందుకు తినకుండా వచ్చావు?
6


నేను చాలాచోట్ల
తిరిగాను గురుదేవా!
కానీ నేను ఎక్కడకు
వెళ్ళినా
భగవంతుడు నన్ను
చూస్తూనే ఉన్నాడు.
అందుకే నేను
ఎవరూ చూడకుండా
ఈ పండును
తినలేకపోయాను.
7
చూశారా పిల్లలూ!
నిజంగా గురుబోధను
అర్థం చేసుకుని
అనుభవంలోకి
తెచ్చుకున్నది
ఇతనొక్కడే.
భగవంతుడు
అన్నిచోట్లా ఉన్నాడు,
అన్నీ చూస్తున్నాడు
అని మీరు బలంగా
నమ్మినప్పుడు మీరు
జీవితంలో ఎటువంటి
తప్పులూ చెయ్యరు.
8

(గత సంచిక తరువాయి) # బ్రాహ్మణుడు -పాలూరి కాళీప్రసాద్

ఇహ రెండవవారు కోనసీమకు చెందిన పెద్ద పండితులు. శ్రీకాళీవనాశ్రమం స్థాపించిన తొలిరోజులలో ఒకసారి ఆయన శ్రీగురుదేవుల దర్శనార్థమై వచ్చారు. వారికి ఆశ్రమంలో వాతావరణం, భక్తులు చేసే సాధన అన్నీ నచ్చాయి కానీ, అందరూ వర్ణాశ్రమాలకతీతంగా సహపంక్తి భోజనం చెయ్యడం మాత్రం ఆయన తట్టుకోలేక పోయారు. ఆనాటి సత్సంగ సభలో శ్రీగురుదేవులు తమ దివ్యబోధామృతాన్ని ముగిస్తూ ఆ పండితునితో 'అయ్యా! ఈనాడు తమ వంటి గొప్ప పండితులు మా ఆశ్రమానికి విచ్చేయడం మా అదృష్టం. మీరిక్కడి వ్యవస్థనంతా క్షుణ్ణంగా పరిశీలించారు కదా! మేము ఆచరించే పద్ధతులలో ఏవైనా లోపాలు వుంటే, తమరు దయతో సెలవిస్తే దిద్దుకునే ప్రయత్నం చేస్తాను' అన్నారు. ఆ పండితుడు మంచి అవకాశం దొరికిందనే ఉత్సాహంతో 'స్వామీ! ఇక్కడ ఆచరించే సాధన పద్ధతులన్నీ నాకెంతగానో నచ్చాయి. అయితే ఒక్కటే లోపం. ఇలా నానా వర్ణాలవారందరూ సహపంక్తి భోజనం చేయడం శాస్త్ర సమ్మతం కాదు. కాబట్టి తమరు బ్రాహ్మణులకు విడిగా భోజనం ఏర్పాటు చేస్తే చాలా బాగుంటుంది' అన్నారు.

శ్రీగురుదేవులు తమలో తాము నవ్వుకుని, 'అయ్యా! తమరు మా మీద దయతో అనుగ్రహించిన ఈ సూచన తప్పక ఆచరించవలసినదే. అయితే మా అమ్మ అయిన జగజ్జనని నాకు కలిగిన సందేహాన్ని తమతో విన్నవించుకోమని సూచిస్తోంది. తమరు రోజూ చీకటిపడ్డాక తమ ఇంటికి ఎడమ వైపు సందు చివరిలో వున్న ఇంటికి వెడతారు కదా. ఆ ఇంటిలో వున్నామెతో తమరు సరససల్లాపాలు ఆడటం, మీరిద్దరూ ఒకే గ్లాసులోని పాలు త్రాగటం, ఒకే తాంబూలాన్ని కలిసి సేవించడం, ఇంకా .. ఎన్నెన్నో లీలలు తమరి ముఖారవిందములో నాకు దర్శనమిస్తున్నాయి. 'ఒరేయ్! ఆ ధన్యురాలి కులమేమిటో, గోత్రమేమిటో ఈ మహాత్ములను అడిగి తెలుసుకోరా' అంటున్నది మా జగన్మాత. ఆ వివరాలు తెలియజేస్తారా?' అన్నారు.

శ్రీగురుదేవులు మరిన్ని వివరాలు బయట పెడుతుండగానే, ఆ

పండితుడు క్షమించమని వేడుకుంటూ వారి పాదాలపై పడిపోయాడు. ఇప్పుడు చెప్పండి వీరిద్దరిలో అసలైన బ్రాహ్మణులెవరు? నిత్యం వేదమాతను సేవిస్తూ కూడా కేవలం శబ్ద జ్ఞానంతోనే సరిపెట్టుకుని ఆ వేదసారాన్ని గ్రహించక తాము ఆరాధించే పరమాత్మకు ప్రతిరూపాలైన తోటి జీవరాశిని కించపరుస్తూ, 'సర్వజీవ తిరస్కారం కేశవం ప్రతి గచ్ఛతి' అని తెలుసుకోలేక ఆ పరమాత్మ నుండి దూరమైపోయేవారిని చూసి జాలిపడటం తప్ప మనమేమి చేయగలం? శ్రీమద్భాగవతంలో కూడా ఇటువంటి సంఘటనలు మనకు గోచరిస్తాయి. ఒకనాడు శ్రీకృష్ణుని సఖులందరూ ఎంతో ఆకలిగా వున్నదంటే, ఆయన వారిని ఆ దగ్గరలో యజ్ఞం చేస్తున్న బ్రాహ్మణుల వద్దకు పంపుతాడు. అయితే వారు వీరిని గొల్లపిల్లలని అవమానించి తరిమివేస్తారు. ఈసారి పరమాత్మ వారిని వెనుకగా వంటింటివైపు వెళ్ళి ఆ బ్రాహ్మణ స్త్రీలను అర్థించమని పంపుతాడు. వారందరూ తమ మహద్భాగ్యానికి ఎంతో సంతోషించి, వండిన వంటలన్నీ తెచ్చి, పరమాత్మను ఆయన సఖులను చక్కగా సేవించుకుంటారు. అసలు విషయం ఆలస్యంగా గ్రహించిన ఆ పండితులు తాము కోల్పోయిన భాగ్యానికి తలలు పట్టుకుంటారు. వారి పాండిత్యం దేనికి అక్కరకు వచ్చినట్లు?

శ్రీ గురుదేవులు మరొక తమాషా అయిన ఘటన చెప్పేవారు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు మానవావతారంలో యశోదమ్మ ఇంట అవతరించాడని విన్న ఒక పండితుడు ఆయనను దర్శించుకోవాలని కోరికతో వ్రేపల్లెకు వస్తాడు. తీరా అక్కడకు వచ్చాక వారు యాదవులనే సంకోచంతో యశోదమ్మ ఇచ్చిన సంబారాలతో స్వయంపాకం మొదలు పెడతాడు. ఆయన అన్నీ వండుకుని, వడ్డించుకుని 'ఓం కేశవాయ స్వాహా' అనగానే, కృష్ణయ్య ఎదురుగా ప్రత్యక్షమవుతాడు. 'అయ్యయో! యశోదమ్మా! ఈ గోపబాలుడెవరో వచ్చి నన్ను మైలపరచేశాడు' అని ఆక్రోశిస్తాడు. ఆ తల్లివచ్చి, పిల్లవాడిని మందలించి, మళ్ళీ సంబారాలు సమకూరుస్తుంది. ఈసారి 'ఓం నారాయణాయ స్వాహా' అనేసరికి మళ్ళీ చిన్నారి కన్నయ్య ప్రత్యక్షం! ఇంక లాభం లేదని, యశోదమ్మ కృష్ణుణ్ణి ఒక గదిలో బంధించింది. ఆ పండితుడు కూడా తన గది తలుపుకు తాళం

మీద తాళం వేసుకుని భోజనానికి కూర్చున్నాడు.

'ఓం మాధవాయ స్వాహా' అనగానే మళ్ళీ స్వామి ప్రత్యక్షం!! ఆ పండితుడు నెత్తినోరూ బాదుకుని, మొత్తుకుంటుంటే యశోదమ్మ వచ్చి కృష్ణుణ్ణి మందలిస్తుంది. అప్పుడాయన 'అయ్యో! అమ్మా! ఈ పండితుని వద్దకు రావడం వలన నేను మైలపడిపోయానా? ఇంతకీ మైల అంటే ఏమిటమ్మా? అసలాయన వద్దకు రావలసిన అవసరం నాకేముంది? ఆయనే కేశవా! నారాయణా! మాధవా! అని మాటిమాటికి నన్ను పిలుస్తున్నాడు' అంటాడు. తన కళ్ళను కప్పిన జాత్యహంకారమనే పొర తొలగిన ఆ పండితుడు, 'అయ్యో! నేను వచ్చినదే తమరి దర్శనార్థం స్వామీ! తీరా తమను చూసేసరికి అసలు విషయం మరచిపోయి, కేవలం కులగోత్రాలనే పట్టించుకుని, అహంకారంతో ప్రవర్తించాను. నన్ను క్షమించండి' అని ఆ చిన్నారి కన్నయ్య పాదాలపై వ్రాలిపోతాడు!!

### పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

**నవంబర్ 2020**

10 మంగళ - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

14 శని - నరక చతుర్థశి , అమావాస్య - దీపావళి - శ్రీసద్గురుపాదపూజ

30 సోమ - కార్తీక పౌర్ణమి - (గురుపౌర్ణమి) - శ్రీసద్గురుపాదపూజ

**డిసెంబర్ 2020**

9 బుధ - శ్రీగురుదశమి. శ్రీబాబూజీ ఆరాధన. శ్రీసద్గురుపాదపూజ.

16 బుధ - శ్రీధనుర్మాస వ్రత ప్రారంభం.

30 బుధ - మార్గశిర పౌర్ణమి, దత్తజయంతి - శ్రీ సద్గురుపాదపూజ.

# ఎవరు అమరుడు?

(గత సంచిక తరువాయి)

-సుషమ్నా ప్రసాద

కౌసల్యుని సంశయ నివృత్తి కాగానే, వాని మిత్రుడు సౌర్యాయణి అనే ముని పిప్పలాదుని తన సంశయ నివృత్తి కోసం ప్రశ్నించాడు. 'హే స్వామీ! ఈ మనిషిలో ఏది నిద్రిస్తున్నది? ఏది మేలుకొని వున్నది? ఎవడికి సుఖం వున్నది? ఏ దేవుడు స్వప్నాన్ని గాంచుతున్నాడు? ఎవనిలో సమస్తం ప్రతిష్ఠితమై వున్నది?'

ఆ ప్రశ్నలకు పిప్పలాద మహర్షి సౌర్యాయణితో వాత్సల్యపూర్వకంగా ఇలా సమాధానం ఇచ్చాడు. 'ఏ ప్రకారంగా అస్తమిస్తున్న సూర్యకిరణాలు సూర్యమండలంలో లయమై, సూర్యోదయం కాగానే అన్ని దిక్కులలో ఎలా వ్యాపిస్తునాయో, ఆ ప్రకారంగానే దశేంద్రియాలు మనస్సులో ఒకటిగా చేరుతున్నాయి. అందువలననే ఆ సమయంలో చూడటం, వినడం, మాట్లాడటం, నడవటం మొదలగు జ్ఞానేంద్రియాలు చేసే పనులు అణిగి వుంటాయి. అందుకే దానిని నిద్రావస్థ అంటారు. జాగ్రదావస్థలోకి వచ్చిన తరువాత మానవుడిలోని దశేంద్రియాలు మనస్సు నుండి బయటపడి వాటిపని అవి చేసుకుంటాయి.

నవద్వారములున్న ఈ దేహమనే పురంలో నిద్రాసమయంలో ప్రాణాగ్నులు నిద్రపోయాక మేలుకొంటాయి. ఈ అయిదు వాయువులకు మనసు యజమాని. ప్రతిదినం అది బ్రహ్మవద్దకు చేరుతుంది. స్వర్గకాముడై యాగం చేసిన వాడు మరణానంతరం స్వర్గం చేరినట్లు, ఉదానవాయువు ప్రతిదినం సుషుప్తికాలంలో ఏ యోగం చేత పొంద శక్యంకాని పరబ్రహ్మ స్వరూపాన్ని పొందిస్తుంది. స్వప్నావస్థలో శ్రోత్రాదీంద్రియాలు శబ్దాదులను వదలి, మనస్సును చేరి నిద్రిస్తుంటాయి. జాగ్రదావస్థలో తాను చూసినదానిని, వినినదానిని, అనుభవిస్తున్నదానిని వాసనా రూపమై చూస్తుంది. ఎప్పుడు ఈ మనస్సు చిద్రూప బ్రహ్మమనే తేజస్సుచేత శరీరమంతా వ్యాపిస్తుందో, అది సుషుప్తి సమయం. అప్పుడు స్వప్నాలు మనస్సును వికలం చేయవు. అందువలన గాఢ సుషుప్తిలో సౌఖ్యం అనుభవిస్తాం.

దర్శన స్పర్శన మననాదులను చేస్తూ వీటన్నిటికి కర్తయై దేహేంద్రియాది సమూహాన్ని తెలుసుకొనే ఈ జీవుడు పురుషుడు

అనబడతాడు. ఈ జీవుడెప్పుడు పరబ్రహ్మాన్ని అజ్ఞాన రహితుడుగా, అశరీరిగా, గుణరహితుడిగా, పరిశుద్ధుడిగా, నాశరహితుడుగా తెలుసుకుంటున్నాడో, అప్పుడు అక్షర బ్రహ్మాన్ని పొందుతున్నాడు. ఇలాంటివాడు సర్వజ్ఞుడు.'

తరువాత సత్యకాముడు పిప్పలాద మహర్షి తనపట్ల దయతో 'జీవితమంతా ఓంకార ధ్యానం చేసినవాడు ఏది పొందుతాడో తెలియజేయ'మని ప్రశ్నించాడు. దానికి సమాధానంగా పిప్పలాద మహర్షి 'ఓంకారము మూడు అక్షరాల సంపుటి. (అ, ఉ, మ). ఓంకారోపాసకుడు ఓంకారము యొక్క మూడు మాత్రలలో ఒకటైన 'అ'కారాన్ని ఉపాసనచేసి ఉత్తమోత్తమమైన మానవజన్మను పొందుతాడు. రెండవ మాత్రయైన 'ఉ'కారాత్మకంగా ఉపాసన చేస్తే అంతరిక్షమైన చంద్రలోకాన్ని పొందుతాడు. అకార ఉకార మకారాలనే మూడు మాత్రలతో కూడిన స్వరూపంగా ఓంకారాన్ని జపిస్తే వాడు బ్రహ్మలోకాన్ని పొందుతాడు.

అలా బ్రహ్మలోకాన్ని పొందినవాడు, సర్వశరీరాలలో ప్రవేశించినప్పుడు పరమ పురుష స్వరూపమైన పరమాత్మను చూస్తున్నాడు. ఓంకారంలోని మూడు మాత్రలను బ్రహ్మదృష్టితో ఒకటి చేసి, పరమాత్మ ధ్యానంతో ప్రయోగిస్తే, మృత్యు దోషం లేని అమృతత్వ సిద్ధిని పొందుతాడు.

ఈ రకంగా ఓంకారం యొక్క మాత్ర త్రయాన్ని ఏ యోగి చక్కగా తెలుసుకుంటాడో, అతను జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు అవస్థలలో పరమపురుష ధ్యానంలో చలించడు.

సత్యకాముని తరువాత సుకేశుడు పిప్పలాదుని సమీపించి వినయంతో నమస్కరించి, తన సందేహాన్ని వ్యక్తపరచాడు. 'స్వామీ! ఒకనాడు కోసలనాథుడైన హిరణ్యనాభుడు నా దగ్గరకు వచ్చి, 16 కళలు గల పురుషుని నీవు ఎరుగుదువా?' అని ప్రశ్నించాడు. నాకు తెలియదని చెప్పాను. నా యందు మీరు అనుగ్రహించి, ఆ వ్యక్తిని గురించి వివరించండి' అని ప్రార్థించాడు.

దానికి పిప్పలాదుడు సమాధానంగా 'ఆ పదహారు కళలుగల వ్యక్తి ఎక్కడో లేడు. ఈ శరీరములోనే వున్నాడు. అతనే హిరణ్యగర్భుడు. ఈతడే ఆ పదహారు కళలను సృజించాడు. అవి వరుసగా 1. ప్రాణం,

2. శ్రద్ధ, 3. ఆకాశం, 4. వాయువు, 5. అగ్ని, 6. జలం, 7. భూమి, 8. దశేంద్రియములు, 9. మనసు, 10. అన్నం, 11. బలం, 12. తపస్సు, 13. వేదాలు, 14. కర్మ, 15. కర్మఫలాలైన స్వర్గలోకాలు, 16. ప్రాణులు అనే పదహారు కళలను సృజించాడు.

సముద్రంలో పుట్టిన నదులు సముద్రంలోనే లీనమవుతాయి. సముద్రజలం ఆవిరై, మేఘముగా మారి, వర్షించి నదులౌతాయి. ప్రవహిస్తూ గంగ, గోదావరి, కృష్ణ, సింధు, బ్రహ్మపుత్ర మొదలగు నామాలను సంతరించుకొని, తిరిగి సముద్రాన్ని చేరి, నామరూప రహితులై, సముద్రమని పిలువబడతాయి.

అదేవిధంగా పురుషుడి నుండి పదహారు కళలు వచ్చి, తిరిగి పురుషుడిలోనే లయమై, వాటి నామ రూపాలను కోల్పోయి, తిరిగి పురుషుడనే చెప్పబడతాయి. అలాంటి పురుషుడు ప్రాణాది కళలు లేనివాడు. కాబట్టి అతను అమరుడు (మరణం లేని వాడు) గా వినుతికెక్కాడు.' అని వివరించాడు.

పిప్పలాద మహర్షి తనను ప్రశ్నించిన ఋషిపుంగవులను వుద్దేశించి, 'ఏ పురుషునిలో ప్రాణాది కళలన్నీ సృష్టి, స్థితి, లయ కాలంలో రథ నాభి (కుండలో) చక్రం యొక్క ఆకుల మాదిరి ప్రవేశపెట్టబడి వున్నాయో, అలాంటి తెలుసుకోవలసిన ఆత్మ స్వరూపుడైన పురుషుడిని గురించి తెలుసుకోండి. అప్పుడు మీరు అమరులు అవుతారు. మరణం మిమ్మల్ని బాధ పెట్టదు. ఇదే పరబ్రహ్మమని గ్రహించండి. దీని కంటే శ్రేష్టమైనది మరొకటి లేదు' అని చెప్పాడు.

ఇదంతా శ్రద్ధగా విన్న సుకేశాది ఆరుగురు మునిపుంగవులు తమను తరింపజేసి, మోక్షమార్గంలో ప్రవేశ పెట్టిన గురువర్యులు పిప్పలాద మహర్షికి నమస్కరించి, వారి అనుమతి పొంది, ఎవరి స్థానాలకు వారు వెళ్ళిపోయారు.

# శ్రీబాబు దివ్యవాణి

(గత సంచిక తరువాయి) - డా॥ రాఘవేంద్ర. పరుచూరి

కులశేఖరాళ్వారు ఒక మహారాజు. ఆయన శ్రీరంగ నాధుణ్ణి ఏమని ప్రార్థించాడు? **'తవ భృత్య భృత్య భృత్యస్య భృత్య పరిచారక ..... ఇతి మాం స్మర లోకనాధ'** అని. వీరే పరమాత్మ స్వరూపులు. 'నాకు ఎన్ని జన్మలు అయ్యాయో, ఇంకా ఎన్ని జన్మలు వున్నాయో తెలియదు. నీవు సర్వశక్తి స్వరూపుడవు. సర్వజ్ఞుడవు - నేను కించిజ్ఞుడను. నీ పాద సేవ వలన నాలో ఈ భావన నిలిస్తే చాలు. నాకిది చాలు. నీ దాసత్వంలో వున్న మధురత్వం ఎందులో వుంది స్వామి? నీ పరమ భక్తుల సేవ, నీ దాసాను దాసుల సేవ చాలు. నీ చరణారవిందముల యందు పుట్టుమచ్చవలె వుండాల'ని మహారాజు వేడుకున్నాడు. ఏ భోగములలో పొందని ఆనందమును నేను నీ పాదారవిందములయందు పొందుతున్నాను ప్రభూ! అనే భావన ఎంత మధురంగా వుందో! అట్టి తారక నామము **'సర్వ బంధాత్ ప్రముచ్యతే'**. అంటే సర్వ బంధముల నుండి రక్షించే దాత. సంసార సాగరంలో కొట్టుకు పోతుంటే ఎవరూ రక్షించలేరు, రక్షించజాలరు. రక్షించగలిగినది కేవలం తారకనామమే. ఎట్టి సంకల్పముల మధ్య వున్నా భగవంతుని స్మరించి, మనస్సునందు నిలుపుకున్న వానికి తప్పక దొరుకుతుంది, రక్షణ కలుగుతుంది.

మనస్సు విషయాదులపై వుంచి నామం జపిస్తే అవే ప్రత్యక్షమవుతాయి. అదే రామ నామమందు నిలిపితే ఇంక కావలసినదేమున్నది? త్యాగయ్య మనస్సు మహారాజు పంపిన భోగములమీదకే పోలేదు. త్యాగయ్య చేసిన రామనామము అతనిని ఈషణత్రయముల నుండి తరింపజేసింది. కమాల్‌దాస్ కొంగున (అతనికి తెలియకుండా) కట్టిన ఆభరణమును చూసి, కబీర్‌దాస్ ఎంత చింతించాడు! 'శాశ్వతమైన రామ రత్నాన్ని ఈ మామూలు రత్నానికి అమ్మావా? నీ మనస్సు ఎలా వచ్చింది?' అని గోడు గోడున విలపించాడు. 'ఈ ధనకాంక్ష నిన్ను ఎలా ఆవరించింది? రామ నామంలో వున్న ఆనందంకంటే ఇది మిన్నయైనదా?' అని దుఃఖించాడు. కబీర్‌కు నిరంతరం రామనామ ధ్యానమే. సర్వం తారక బ్రహ్మమే.

- సశేషం

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

శ్రీ షిరిడీ సాయిబాబావారు భిక్షాటనకు వచ్చినప్పుడు అల్లా అచ్ఛా కరేగా! అన్నప్పుడు మనం మన అహంకార మమకారాలను త్యాగం చేయగలుగుతున్నామా? శ్రీశంకరులు ఎల్లప్పుడూ సంసార వ్యామోహం అనే అరణ్యంలో సంచరించే మనస్సును, విషయాదుల వెంటబడి తిరిగే మనస్సును, స్వేచ్ఛగా ఆశలు కోర్కెలు అనే కొమ్మలపై దుమికే మనస్సును ఒక కోతితో పోల్చారు. దానిని భక్తి అనే తాడుతో కట్టి శంకరుడి ఆధీనం చేసుకోమని వేడుకుంటారు. ఎందుకంటే మనస్సు చాలా బంధన తెచ్చిపెడుతోంది. అందుచేత దీనినుండి విముక్తి చేసి, అంటే మర్కటంలాంటి ఈ మనస్సును నువ్వు భక్తిఅనే తాడుతో కట్టివేసి, నీతోపాటుగా భిక్షాటనకు తీసుకునిపోతే నీకూ భిక్ష బాగా వేస్తారు. ఇదే భావనతో ధ్యానానికి కూర్చుంటే అప్పుడు మనస్సు భగవత్పాదారవిందములయందు స్థిరంగా నిలుస్తుంది. ఎటూ పోదు. ఒకవేళ ఎటైనా పోతే దాన్ని భగవన్నామంతో స్థిర పరచుకోవాలి. బ్రహ్మస్థానం నీది. బ్రహ్మము నీవే అయి వున్నావు. దానికి భిన్నంగా లేవు. నీ స్థానం అది కాదు ఇది. ఇంద్రియాతీత స్వరూపుడవు సుమా! అని మరల మరల దానికి గుర్తు చేస్తూ వుండాలి.

పప్పు రోటిలో రుబ్బుతూ వుంటే, మాటిమాటికి అది బయటకు వస్తూంటే, మనం చేతతో రోటి లోపలికి తోస్తూ వుంటాం కదా. అప్పుడు అది పిండిలాగా తయారు అవుతుంది. ఇంద్రియాలు, బుద్ధి అన్నీ వుండాలంటే దేహం వుండాలి. దేహం వుంటేనే కదా ఆత్మవిద్యను గురించి తెలుసుకోవడం, ఆనందించడం వంటివి జరుగుతాయి. దేహము, దేహం లోపల బుద్ధి వుండబట్టే ఇంద్రియాతీత స్థితి అంటే ఏమిటో తెలుసుకోగలుగుతున్నాం. అదే విధంగా మనస్సును మహాత్ముల పాదాల చెంతకు, వారి బోధామృతాన్ని వినిపిస్తూ, తోస్తూ వుంటే ఆ పాదాల చెంతనే అది నలిగిపోతూ వుంటే ఆ మనస్సు యొక్క రూపం పోతుంది, పేరు పోతుంది. అందుకే ఈ మనస్సును ఎంతో జాగరూకతతో భగవంతుడి దివ్య చరణారవిందాలయందు నిలిచేటట్లు చేయాలి.

ప్రతి విషయంలోనూ మనం భగవంతుడిని గుర్తుతెచ్చుకుంటూ

వుండాలి. భగవంతుడు పూలదండలకి, ప్రసాదాలకి లొంగడు. భక్తితో నిండిన మనస్సుకి లొంగుతాడు. అలాగే భక్తుల మనస్సులను కించపరచకూడదు. దీనికి ఒక ఉదాహరణ చెబుతూ శ్రీమాతాజీ ఒకసారి అమెరికా పర్యటనకు వెళ్ళినప్పుడు జరిగిన సంఘటన వివరించారు.

'ఆ రోజు శ్రీరామ నవమి. ఒక భక్తుడు స్వామివారికి పూజ చేసుకుంటామని కోరడమూ, స్వామి అంగీకరించడమూ జరిగింది. వారు స్వామికి దండ వేసుకుంటామన్నారు. అంటే మాతాజీ దండ గుచ్చడం ప్రారంభించారు. ఇంతలో శ్రీగురుదేవులు అక్కడకు వచ్చి, భగవంతుడు దండఏమైనా కోరాడా? అని, మళ్ళీ వేయించకపోతే వారెక్కడ బాధ పడతారో అని, వారే పూలు వెడం వెడంగా వేసి ఎలా దండ గుచ్చాలో చూపించారు. ఇలా చేస్తే ఎక్కువ పూలు పట్టవని కూడా చెప్పారు. ఎందుకంటే అమెరికాలో ఆ రోజుల్లో పూలు ఎక్కువ దొరికేవి కావు. దొరికినా కూడా చాలా ఖరీదు ఎక్కువ. మొత్తానికి పూజ ఎంతో భక్తితో, తృప్తితో భక్తులని బాధ పెట్టకుండా వారిచేత పూజ చేయించుకున్నారు. మహాత్ములు ఎంతో జాగరూకతతో శిష్యులలో భక్తిని పెంపొందించడానికి కొన్ని చర్యలు చేస్తూ వుంటారు.

అదే విధంగా ప్రసాదాలు ఎన్ని వున్నా అన్నీ తిననక్కర్లేదు. కొంచెం తీసుకుంటే చాలు. పెట్టాలనే ధర్మం భక్తులకు వుంటుంది. కానీ బజారులో వున్నప్పుడే నిగ్రహం వుండాలి అంటారు. అలాగే కొంచెం ప్రసాదం తీసుకున్నా చాలు అంతఃకరణ ఎంతో తేలికపడుతుంది. పైగా, బాగా కడుపునిండా తిన్నా, ధ్యానానికి కూర్చున్నప్పుడు నిద్ర వచ్చే అవకాశం వుంది. ప్రపంచంలో ఎక్కడికక్కడ భగవంతుడు మనకు ఎంత కావాలో అంత అందిస్తూ, మనకు అవసరమైనంత ఏర్పాట్లు చేస్తూనే వున్నాడు. శ్రీ గురుదేవులు కూడా వంట ఏం చేయాలా అనే ఆలోచనలో వున్నప్పుడు 'ఏముంది? పప్పులో, ఆకుకూర వుంటే వేసి కాస్త తాళింపు వేస్తేసరి, లేకపోతే వుత్త తాళింపు వేసినా అయిపోయింది వంట. మజ్జిగ వుండనే వుందిగా' అనేవారు. దీనినిబట్టి సాధకుడు ఆహార వ్యవహారాలు తన సాధనకు అడ్డురాకుండా చేసుకుని, పరిస్థితులకు అనుకూలంగా ఎలా మార్చుకోవాలో శ్రీగురుదేవులు నేర్పించారు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**నవంబర్ 2020**

10 మంగళ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

13 శుక్ర - మాసశివరాత్రి

14 శని - నరక చతుర్దశి - అమావాస్య - దీపావళి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన. రాత్రి 8గం.లకు టపాకాయలు కాల్చటం.

15 ఆది - ఆకాశదీప ప్రారంభం.

17 మంగళ నుండి 25 బుధ వరకు - ప్రతిరోజూ ఉదయం శ్రీరామలింగేశ్వర స్వామివారికి పంచామృతములు, నవరసాలతో ఏకాదశ రుద్రాభిషేకములు, లక్షబిల్వార్చన.

18 బుధ - నాగుల చవితి.

25 బుధ - చిలుక ఏకాదశి - శ్రీసద్గురు పాదపూజ. ఏకాహం సంకీర్తన. సామూహిక శ్రీసత్యనారాయణ స్వామి వారి వ్రతాలు. భక్తసమారాధన.

26 గురు - క్షీరాబ్ది ద్వాదశి - శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

28 శని - శనిత్రయోదశి.

29 ఆది - జ్వాలాతోరణం, శ్రీరామలింగేశ్వర స్వామి నగరోత్సవం.

30 సోమ -కార్తీక పౌర్ణమి - (గురుపౌర్ణమి) - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

**డిసెంబర్ 2020**

3 గురు - శ్రీగురుదేవులు స్వస్వరూపలయం పొందిన తేదీ.

3 గురు నుండి 9 బుధ వరకు శ్రీ సద్గురుదేవుల ఆరాధనా మహోత్సవాలు.

9 బుధ - శ్రీగురుదశమి, దీపోత్సవం, ఆరాధన.

10 గురు- శ్రీసద్గురుదేవుల మహాభిషేకము. శ్రీ సద్గురు మండల దీక్షలో పాల్గొన్నవారికి హోమం పూర్ణాహుతి, దీక్ష విరమణ.

12 శని - శని త్రయోదశి

13 ఆది - మాసశివరాత్రి

14 సోమ - అమావాస్య.

16 బుధ - శ్రీధనుర్మాస వ్రత ప్రారంభం.

20 ఆది - శ్రీసుబ్రహ్మణ్య షష్ఠి.

25 బుధ - క్రిస్టమస్, ముక్కోటిఏకాదశి మరియు గీతాజయంతి. ఉత్తరద్వార దర్శనం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

30 బుధ - మార్గశిర పౌర్ణమి, దత్తజయంతి - శ్రీ సద్గురుపాదపూజ.

# గౌతమ మహర్షి

- రమణ ప్రసాద్

అహల్య వివాహమైనప్పటినుండి ఇంద్రుడు ఆమె లోకాతీత సౌందర్యానికి వశుడై ఆమె పొందుకోరుతున్నా, అహల్య పాతివ్రత్యానికి వెరచి ఉన్నాడు. తన కామవాంఛ తీర్చుకోవటంకోసం ఒక ఉపాయం ఆలోచించి కోడి రూపాన్ని ధరించి అర్ధరాత్రి సమయాన కూయటం మొదలు పెట్టాడు. ఆ కోడికూత విని గౌతముడు కాలకృత్య నిర్వహణకై నదీ తీరానికి వెళ్ళాడు. ఆ అవకాశమును పురస్కరించుకొని ఇంద్రుడు గౌతముని రూపం ధరించి ఆశ్రమంలోనికి వచ్చి ఆమె పొందు కోరాడు. ఆ వచ్చినది తన భర్తగా భావించి ఆమె అంగీకరించింది.

వారు కామకేళిలో మునిగియుండగా, నదీ స్నానానికి వెళ్ళిన గౌతముడు ఇంకా చాలా పొద్దు ఉంది అని ఆశ్రమానికి తిరిగి వచ్చి లోనికి ప్రవేశించగానే అహల్య ఆశ్చర్యపడి, "మహాత్మా! ఇంతవరకు నాతోనే ఉన్న మీరు రెండు రూపాలను ఎందుకు ధరించారు?" అని ప్రశ్నించింది.

ఇంద్రుడు వణికిపోయి పిల్లిరూపంలో బయటకు పోవటానికి ప్రయత్నించాడు. గౌతముడు ఆ పిల్లిని చూసి, "ఓరీ! నీవెవ్వరు? నిజం చెప్పకపోతే నిన్ను దగ్ధంచేస్తాన"నగా, ఇంద్రుడు నిజ స్వరూపాన్ని ధరించి క్షమాభిక్ష వేడాడు.

అహల్య ఆశ్చర్యభరితయై, "మహాత్మా! పంచ భూతాల సాక్షిగా ఈ మోసం నాకు తెలియదు" అని శపథం చేసింది. గౌతమ మహర్షి,"నీవు తెలిసి చేసినా, తెలియక చేసినా దోషం దోషమే. తెలియక నిప్పును తాకితే కాలకుండా ఉంటుందా? నీవు చైతన్యహీనవై శిలగా పడి వుండమ"ని శపించి, ఇంద్రుని చూసి, "ఓరీ! నీచుడా! మహా పతివ్రతయైన అహల్యను మోసగించావు. నీ శరీరమంతా యోనిమయమై నీవు నిత్యఖేదమందెదవు గాక! నీవు పదభ్రష్టతనంది దైన్యమైన జీవితమును గడిపెదవు గాక!' అని తీవ్రంగా శపించాడు.

అప్పుడు వారిరువురూ శాప విముక్తిని కోరగా, గౌతముడు అహల్యవైపు చూసి, "పాపాత్మురాలా! నీవు శిలవై రామ స్మరణ చేస్తూ సహస్ర వర్షాలు తపింపుము. ఈ ఆశ్రమం ఇక నిర్మానుష్యమయిపోతుంది. శ్రీరాముని పాద పుంజములు నీ శిరస్సు పైన పడగానే నీకు శాపవిముక్తి కలుగుతుంది" అన్నాడు. ఇంద్రుడిని చూసి, "పాపాత్ముడా! నీపై నాకు కరుణ కలిగింది. నీ యోనులు ఇతరులకు కన్నులవలె కనిపిస్తాయి. నీవు పదభ్రష్టుడవైనా కొంతకాలానికి స్వపద ప్రాప్తి పొందుతావు" అని

శాపవిముక్తినొసగి హిమగిరిలో తపస్సు చేస్తూ ఉండిపోయాడు.

కాలక్రమంలో శ్రీరాముని పాద రజం సోకగానే అహల్య శాప విముక్తురాలై స్త్రీ రూపాన్ని ధరించి, గౌతమ మహర్షిని చేరి మహా పతివ్రతయై ఆయనను సేవించింది.

గౌతమ మహర్షి లోకానికి గౌతమ ధర్మ సూత్రాలను ప్రసాదించాడు. రెండవదియైన గౌతమ న్యాయ శాస్త్రాన్ని అందించాడు. మూడవదియైన జ్యోతిశ్శాస్త్ర గ్రంథాన్ని లోకానికి అందించి లోకోపకార మొనర్చినవాడు గౌతమ మహర్షి. ఈయన సప్తఋషులలో ఒకడు.

# నేడే ఈ నాడే

- పెనుమాక నాగేశ్వరరావు

నేడే ఈనాడే కరుణించే నన్ను శ్రీబాబే
నేడే ఈనాడే కరుణించే నన్ను శ్రీబాబే
కనుల ముందున్న రతనాల మూర్తిని మహిమ లెరిగి కొలిచితిని
మనసు వుంచి శిరము వంచి మదినే గుడిగా మలచితిని ॥నేడే॥

ముప్పు తొలిగీ తప్పులెరిగి కోవెల ముంగిట నిలిచితినీ
చెంతకు చేరి చింతను వీడి ఆర్తిగా స్వామిని పిలిచితిని ॥నేడే॥

మదిలో మెదిలే భావనలన్నియు దాచక స్వామికి తెలిపెదను
సేవచేసి, సేద తీరి తనివి తీరా గానము చేసి
తన్మయమొందెదనూ ॥నేడే॥

ఆరనిజ్యోతుల హారతి వెలుగుల సద్గురుస్వామిని చూసెదను
గురురాముని కమనీయాకృతినే కలకాలం మది నిలుపుదును
గురి తప్పని గురుకృపతోనే కైవల్యమునే పొందుదును ॥నేడే॥

# సోదరి నివేదిత

సేకరణ - మురళి

సోదరి నివేదిత 1867సం॥లో ఇంగ్లాండ్‌లో జన్మించారు. జన్మనామం మార్గరెట్ నోబుల్. తండ్రి శామ్యూల్ రిచ్మండ్ నోబుల్ మత ప్రచారకుడు. దీనులకు సేవ చేయడం తనకు ఎంతో ఇష్టంగా వుండేది. తోటి మనుష్యులను కరుణతో చూడటమే భగవంతునికి నిజమైన సేవ చేయడం అని చిన్నతనంలో తండ్రి చెప్పిన మాటలు ఆమెను ఎంతో ప్రభావితం చేశాయి. తండ్రి స్ఫూర్తిదాయకమైన మాటలతో తన పదిహేడవ ఏటనే ఒక పాఠశాలలో ఉపాధ్యాయినిగా చేరారు. రెండు సంవత్సరాల అనంతరం అనాధశరణాలయంలో బోధకురాలిగా చేరారు. అనంతరం బొగ్గుగనిలో పనిచేస్తూ అక్కడి బీదవారికి ఎంతో సేవ చేశారు.

మహిళలకు సరియైన విద్యావకాశాలు కల్పించి, విద్యావంతులను చేసినప్పుడే దేశం, సమాజం అభివృద్ధి చెందుతాయని ఉద్ఘాటించిన మార్గరెట్ మహిళాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. ఇంగ్లాండ్‌లోని విద్యా సంస్కర్తలు విద్యాబోధనలను సంస్కరించాలని, విద్యార్థుల ఆసక్తిని అనుసరించి బోధించాలని, విద్యార్థులకు వ్యాయామం, ఆటలు, పరిశీలన, అనుకరణ, నిర్ణయాత్మక విద్య అవసరమని ఇచ్చిన సలహాలు నూతన విద్యావిధానానికి నాంది పలకగా అనేకమంది ఉపాధ్యాయులు వీటిని అనుసరించారు. మార్గరెట్ కూడా ఈ విద్యా విధానాన్ని అనుసరిస్తూ రచనలు, ప్రసంగాలు చేసేవారు. కొద్దిరోజుల తరువాత తానే స్వంతంగా పాఠశాలను ప్రారంభించి నిర్బంధ విద్య కాకుండా విద్యార్థుల ఆసక్తిని అనుసరించి బోధించేవారు.

ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూనే మత ప్రచారం చేయాలని భావించారు. క్రైస్తవ మతముతో పరిచయం పెరుగుతున్న కొద్దీ ఆమెలో అసహనం పెరిగింది. అంతులేని మతపరమైన ఆంక్షలను సహించలేక పోయారు. మనుష్యులకు మతం అవసరమే అయినా, తన మనస్తత్వానికి క్రైస్తవ మతం సరిపోదని, క్రొత్త మత విధానం ఏదైనా కావాలని భావించారు. వ్యక్తి స్వాతంత్ర్యమును హరించని మతం కొరకు అన్వేషించడం మొదలు పెట్టారు. ఆ సమయంలో బుద్ధ భగవానుని చరిత్ర చదవడంతో ఆమెకు ఆసియాఖండ దేశాలలోని మతముల

గురించి అవగాహన, ఆసక్తి ఏర్పడింది.

స్వామి వివేకానంద 1895 నవంబర్‌లో అమెరికా నుంచి తిరుగు ప్రయాణంలో లండన్‌లో మూడు నెలలు వున్నారు. ఆ సమయంలోనే స్వామిని ఒక స్నేహితురాలి ఇంట్లో చూడటం, వారి ఉపన్యాసం వినడంతో మార్గరెట్ జీవితమే మారిపోయింది. భారతీయుల సహనం, సాంఘిక జీవితం, స్త్రీల ఔన్నత్యం గురించి విన్న మార్గరెట్ తనకు మనశ్శాంతిని ఇవ్వగలది భారతదేశమే అని నమ్మింది. స్వామి వివేకానంద ఆమెను భారతదేశానికి ఆహ్వానించినదే తడవుగా ఆమె ఇక్కడకు రావాలని నిర్ణయించుకున్నారు. 1898వ సంవత్సరం జనవరి 28న, ఆమె భారతదేశం చేరుకుని బాలల విద్యాభివృద్ధికి, మహిళల విద్యకోసం ఎంతగానో పాటుపడ్డారు. వరదలు వచ్చినప్పుడు, ప్లేగు వ్యాధి సోకినవారికి ఇతోధిక సేవ చేశారు. స్వామి వివేకానంద ఆమెకు బ్రహ్మచర్యదీక్షను ఇచ్చి నివేదిత అనే నామాన్ని ఇచ్చారు. ఆమె ఇంగ్లాండ్ నుంచి వచ్చి, భారతదేశంలోని స్త్రీలకు, దీనజనులకు చేసిన సేవ నిరుపమానమైనది. చివరి రోజులలో విశ్రాంతి, ప్రశాంతత కొరకు డార్జిలింగ్ వెళ్ళారు. అక్కడ అనారోగ్యం పాలై, 1911వ సంవత్సరం అక్టోబర్ 13న భగవంతునిలో లీనమైపోయారు. సోదరి నివేదిత చేసిన సేవల గురించి తెలుసుకోవాలంటే ఎంతో సమయం పడుతుంది, అనేక గ్రంథాలు చదవవలసి వుంటుంది.

*ఇంతలోతు అని చెప్పడానికి వీలులేని ఈ జీవిత సముద్రంలోని అలల సమూహంలో జరిగే సంఘర్షణలో నా శరీరం అనే నావ నేడో రేపో మునగటానికి సిద్ధంగా వుంది. నాలోని ఇంద్రియాలే మొసళ్ళు అయి మీద పడటానికి సిద్ధంగా వున్నాయి. ఇక ఈ సమయంలో జాప్యం చేయకుండా నాకు అభయం ఇవ్వక తప్పదని వేడుకుంటూ నా గురుదేవుల పాద పద్మాలకు కడు భక్తితో నమస్కరిస్తున్నాను.*

*- డా॥ వి.వి.ఆర్ ప్రసాద్ రావు*

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

## శ్రీహరిరావు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

27-8-1959: పోతునూరు సుబ్బారావు గారు శ్రీ బాబుతో మాట్లాడుతూ, గిట్టని వారెవరో శ్రీ బాబుకు అపకారం తలపెడుతున్నారని చెప్పారు. శ్రీ బాబు " కంసుడు కృష్ణుణ్ణి చంపుతానని ప్రగల్భాలు పలికాడట. రూపం లేని వాణ్ణి ఎలాగ చంపుతాడు?" అని నవ్వారు.

3-9-1959: శ్రీహరిగారింట్లో 'గీతోపదేశం' కాలెండర్ చూస్తూ శ్రీ బాబు "కృష్ణుడు రథం దిగి నుంచున్నది ఎందుకో తెలుసా? తన భక్తుడెక్కడ పారిపోతాడో అని భయం కొద్దీను" అని, "ఉన్నది కృష్ణుడొక్కడే. మిగతా అంతా హుళక్కి" అని నవ్వారు.



10-10-1959: శనివారం, మహర్నవమి.

గుండుగొలనులో భోగిరాజమ్మగారింట్లో దసరాలలో ఈ రోజు ఒక స్వామీజీ వచ్చారు. పూర్వాశ్రమంలో వారు వేమూరి సీతారామ శాస్త్రిగారు (తనికెళ్ళ చలపతిగారి అల్లుడు). శ్రీ బాబుతో సత్సంగ సమావేశం జరుగుతుండగా వారు వచ్చి నమస్కరించి, శ్రీ బాబు అనుమతి పొంది యిలా చెప్పారు "అప్పట్లో బందా తాతయ్యగారు మొదలైన వారితో కలిసి నేను పేకాడుతుంటే ఆ ప్రక్కనుంచే చక చకా నడిచి వెడుతూ శ్రీ బాబు నాకు దర్శనమిచ్చే వారు. ఆ తరువాత నేను సన్న్యసించి, రెండు వందలయేళ్ళ నుంచి తరతరాలుగా మా యింట్లో పూజలందుకుంటున్న 'వనదుర్గ' తల్లిని ఉపాసన చేస్తూ, తీవ్రంగా తపస్సు చేశాను. 'అమ్మ' దర్శనం కోసం చాలా యేళ్ళు పరితపించాను. ఒక రోజు నేను ధ్యానంలో ఉండగా నాకు జగన్మాత, మళ్ళీ అమ్మ స్థానంలో శ్రీ ప్రసాద దేవులు మార్చి మార్చి దర్శనమిచ్చారు. బ్రహ్మానందం పొందిన నాకు 'వీరిని మునుపెక్కడో చూసిన గుర్తు' అని అనిపించింది. గుండుగొలనుకు ఉత్తరం వ్రాస్తే "మీ ప్రసాద దేవులు యిక్కడనే ఉన్నా'రని వీళ్ళు తెలియబరిచారు. వెంటనే

వచ్చాను. ఇప్పుడిక్కడ యీ మహాత్ముని దర్శన భాగ్యం పొంది ఆనందంతో మైమరిచిపోతున్నాను. మీరందరూ  ఎంతో అదృష్టవంతులు. వీడున్నాడే - యీ నల్లనయ్య -సామాన్యుడు కాదండోయ్! సాక్షాత్తు పరబ్రహ్మము. నర మాత్రుడని ఎన్నడూ పొరబడి చెయ్యి జార్చుకోకండి సుమా!" అని ఎన్నెన్నో ఉదాహరణలతో మాధవుడే మానవాకృతి ధరించి మానవులను ఎలా మాయ చేస్తాడో వర్ణిస్తుంటే శ్రీ బాబు నిజంగా అదంతా తమకేమీ తెలియదన్నట్లు చిరునవ్వులు చిందిస్తూ కూర్చున్నారు. మాయలో పడవేయటమంటే యిదే!

5-11-1959: దసరా పూజల అనంతరం శ్రీ బాబు కలకత్తా వెళ్ళి యీ రోజే ఏలూరు వచ్చారు. "అహోబలరాజుగారితో లండన్ వెళ్ళిపోతారేమో అనుకున్నాము" అని భక్తులంటే, శ్రీ బాబు "లండన్ వెళ్ళి వచ్చేందుకు నాలుగు వేల రూపాయిలు అవుతాయి(ఆ రోజులలో ) . ఆ డబ్బుతో ఒక బీద కుటుంబం ఖర్చు హాయిగా గడిచిపోతుంది" అన్నారు.

6-11-1959: శ్రీ బాబు అస్వస్థతగా ఉన్నారని డా॥ రాజశేఖర రావుగారి దగ్గరకు తీసుకుని వెళ్ళి పరీక్షలు చేయించారు. శ్రీ బాబు "నేను చిన్నపుడు జామ చెట్టు మీదనో, మామిడి చెట్టు మీదనో కాయలు తింటూ, అల్లరి పనులు చేస్తూ హాయిగా ఉండే వాణ్ణి. వీళ్ళందరూ యిప్పుడు నాకేదో అయిందంటూ ఎక్కడ లేని మందులూ తినిపిస్తున్నారు. ఆ మందులు వేసుకుంటే వచ్చిన అనారోగ్యమే గాని, జగన్మాత దివ్య నామౌషధం నిత్యం సేవించే నాకు అనారోగ్యమేమిటి? " అన్నారు.

ఇంటివారి పాప శ్రీ బాబు వద్దకు వచ్చి, వారి చేతికి ఉన్న రాళ్ళు పొదిగిన గొలుసు పట్టుకుని 'యీ గాజు బాగుంది! ' అన్నది. శ్రీబాబు "అమ్మకు గాజులు యిష్టం గదా! అందుకని నేను వేసుకున్నాను. నేను అమ్మ లాగా చీర కూడా కట్టుకుంటాను తెలుసా? " అని ఆ పాపను ఒడిలోకి తీసుకుని " ఇటువంటి పసివారిలో  జగన్మాతను చూసుకో గలిగితే గృహస్థులకు యింతకంటే వేరే సాధన ఏమి కావాలి? " అన్నారు. యశోదానందుల మహద్భాగ్యాన్ని వర్ణిస్తూ శ్రీ బాబు తన్మయత్వం పొందారు.

-సశేషం

## విష్ణు  కథలు

# శ్రీరామానుజులు

-రమణ ప్రసాద్

ప్రకృతిలో సజాతీయమైన ఈ కాలం భగవంతునిలో ఇమిడి ఉంది. ఈ కాలాధీనమైన ప్రపంచమే జీవుని జీవయాత్రకు కావలసిన సామగ్రిని ఇస్తుంది. అంతే కాదు జీవుడు భగవంతుని దిశగా పురోగమించటానికి, భగవంతుని పొందేవరకు సాధనంగా కూడా ఉపయోగపడుతుంది.



జీవుడు ఆత్మసారం యొక్క అంశం. అందుచేతనే జీవుడు రెండు రకాల జ్ఞానాలు కలిగి ఉన్నాడు. ఒకటి స్వరూప జ్ఞానం. రెండు పరిణామ జ్ఞానం. స్వరూపజ్ఞానంలో జీవుడు మారడు. పరిణామ జ్ఞానంలో మారతాడు.

జీవులను మూడు రకాలగా వర్గీకరించవచ్చు. ఒకరు నిత్యజీవులు – వీరికి ఎప్పుడూ బంధంలేదు. రెండు ముక్తజీవులు – వీరు ఒకప్పుడు బంధంలో ఉండి తర్వాత ముక్తిని పొందుతారు. మూడు బద్ధజీవులు – వీరు సంసార సుడిగుండంలో చిక్కుకొని జన్మనుండి జన్మకు పరిభ్రమిస్తూ చిట్ట చివరకు భగవంతుని చేరుకుంటారు.

మోక్షధామాన్ని చేరుకోవటానికి కర్మజ్ఞాన, భక్తిమార్గాలగుండా పయనించాలి. నిష్కామంగా చేసే కర్మ మనోమాలిన్యాన్ని పోగొట్టి మనస్సును శుద్ధ పరుస్తుంది. శుద్ధ మనస్సు మాత్రమే 'నేను' ను ధ్యానించి తెలుసుకోగలదు.

జీవుని భక్తి పరిపక్వమైనప్పుడు భగవత్సాక్షాత్కారం లభిస్తుంది.

విశిష్టాద్వైతంలో జీవన్ముక్తి అనేది లేనే లేదు. కర్మ ముక్తిని ప్రసాదించలేదు. సహాయకారి మాత్రమే. గమ్యాన్ని చేరటానికి విశిష్టాద్వైతం మరొక మార్గాన్ని కూడా భోధిస్తుంది. అదే ప్రపత్తి మార్గం! అంటే భగవంతునికి సంపూర్ణమైన ఆత్మ సమర్పణ. ఈ మార్గానికి సర్వులూ అర్హులే. భగవంతుని ఇచ్ఛనే అనుసరించాలి. ప్రపత్తి మార్గంలో జీవుడు, భగవంతుణ్ణి ఆశ్రయించాలి. ఆయనే రక్షకుడు, ఉద్ధారకుడు అని మనః పూర్వకంగా నమ్మాలి. ప్రపత్తి ఎంత ఘనమైనది అంటే జ్ఞానం చేత కలిగిన భక్తి కూడా ఈ ప్రపత్తి కే దారి తీస్తుంది.

ఇట్లా పరిపూర్ణశరణాగతి, ఆత్మ సమర్పణ, చేసినవారు మాత్రమే రక్షింపబడతారు. వీరు శరీర పతనానంతరం ఉత్తమోత్తమ మైన వైకుంఠ ధామాన్ని చేరుకుంటారు. ఇక్కడ వీరు సదా శ్రీమన్నారాయణుని సన్నిధిలో ఉంటూ, ఆ సన్నిధి లోని మహదానందాన్ని చూరగొంటూ ఉంటారు.

***ఒక జాలరి నీటి గుంటలో గాలం వేసి, చేపలు పడుతున్నాడు. ఒక అవధూత వానిని సమీపించి, 'ఆచోటకు పోవడానికి మార్గమేమి?' అని అడిగాడు. అదే సమయంలో చేప గాలానికి చిక్కబోతున్నట్లుగా ఆ చేప ఎరను కొరుకుతూ కనిపించింది. అందుచేత ఆ జాలరి ఏమీ మాట్లాడక తన గాలము నందే దృష్టిని వుంచి చూస్తున్నాడు. కొంతసేపటికి చేప గాలానికి చిక్కిన తరువాత ఆ జాలరి వెనుకకు తిరిగి, 'అయ్యా! తమరేమిటి అంటున్నారు?' అని అడిగాడు. అవధూత ఆ జాలరివానికి చేతులు జోడించి నమస్కరిస్తూ 'అయ్యా! నీవు నాకు గురుడవు. నేను నా ఇష్ట దైవమును ధ్యానించినప్పుడు ఇక నుంచి నీ మార్గమునే అనుసరించి, నా ధ్యానము ముగియునంత వరకూ మరి దేనిని గురించి విచారించకుండెదను గాక!' అన్నాడు.***

***- శ్రీ రామకృష్ణ పరమహంస***

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD